సంపుటి : 10
సంచిక : 05
గురువారం
01 అక్టోబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వంవాయిస్

10 YEARS CELERRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE





Contact For Ads:
7579339999


## సంక్షేమ పథకాల కన్వర్జెన్స్‌తో

# పేదలకు గరిష్ట ప్రయోజనం

- పాలనపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు
- ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు ఐఐఎం, ఐఐటీల్లో శిక్షణ ఇచ్చే అంశంపై పరిశీలన
- పీ4 కార్యక్రమం పర్యవేక్షణకు సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తరహా వ్యవస్థ ఏర్పాటు
- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచన
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలో ఏపీని ఆదర్శంగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యం



**అమరావతి, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను సమన్వయం చేయడం ద్వారా పేదలకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పాలనలో నాణ్యత, పారదర్శకతను పెంపొందించేందుకు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులకు కూడా ఐఐఎం, ఐఐటీల వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో శిక్షణ ఇప్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం 'పేదల సేవలో - సంక్షేమ కార్యక్రమాల కన్వర్జెన్స్' అనే అంశంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, మిగతా .. 2లో..

### మహిళలకు ఏసీ బస్సుల్లోనూ

## ఉచిత ప్రయాణం : చంద్రబాబు

**విజయవాడ, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** తమ ప్రభుత్వం 120 ఏళ్ల నాటి ఇళ్ల స్థలాల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడలోని మకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సొంత ఇల్లు అనేది పేదల జీవితకాల స్వప్నమని, దీని కోసం 40 నుంచి 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారు ఎందరో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మిగతా .. 2లో..

### 'బాబాయ్ హత్యతో

# అబ్బాయికే లాభం'



- జగన్ మౌనంపై మంత్రి నిమ్మల ప్రశ్నలు
- వివేకా హత్యపై మంత్రి నిమ్మల తీవ్ర ఆరోపణలు
- కేసులో కీలక వ్యక్తుల మరణాలపై ప్రశ్నలు
- రూ.40 కోట్ల సుపారీ అంశాన్ని ప్రస్తావించిన మంత్రి
- ఈడీ అటాచ్‌మెంట్‌ను ప్రస్తావించిన నిమ్మల
- అజయ్ కల్లాం వాంగ్మూలాన్ని గుర్తుచేసిన మంత్రి

**మంగళగిరి, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు సునీల్ యాదవ్ ఇచ్చిన వాంగ్మూలంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. వివేకా హత్యతో అంతిమంగా లబ్ధి పొందింది జగన్, ఆయన కుటుంబ సభ్యులు, అవినాష్‌రెడ్డి అని సునీల్ యాదవ్ చెప్పినట్లు మంత్రి పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మిగతా .. 2లో..

## ఏపీలో కమ్మ, క్రైస్తవ సామాజికవర్గాలదే అధికారం



- టీడీపీ, వైసీపీలకు ప్రత్యామ్నాయం అవసరమన్న విజయసాయి
- విశాఖ రాజధాని విషయంలో జగన్ యూటర్న్ తీసుకున్నారని విమర్శ
- లిక్కర్ కుంభకోణంతో తనకు సంబంధం లేదని స్పష్టీకరణ

**విశాఖపట్నం, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో అధికారం కేవలం కమ్మ, క్రైస్తవ సామాజిక వర్గాలకే పరిమితమైందని, ఈ రెండు కుటుంబ పార్టీలకు ప్రత్యామ్నాయం అవసరమని మిగతా .. 2లో..

### మేధావులు, విద్యావేత్తలపై

## మోదీ అక్కసు

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**ఢిల్లీ, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని మోదీ సామాజిక వ్యతిరేకి అని, ఆయన వ్యవస్థ మొత్తం విద్యను ద్వేషిస్తుందని, విద్యార్థులు ఆలోచించడం, ప్రశ్నలు వేయడం ఆయనకు ఇష్టం ఉండదని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రధాని కార్యాలయం జోక్యంతో.. పలు విద్యా సంస్థల్లో పాఠ్యాంశాలుగా ఉన్న పలువురు మేధావులు, విద్యావేత్తల రచనలను ఉన్నత విద్యాశాఖ పరిశీలిస్తోందని వచ్చిన మీడియా కథనాలను రాహుల్ బుధవారం సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ రచనలను విషంతో పోల్చిన ఓ సోషల్ మీడియా పోస్టుతో ఈ విచారణ మిగతా .. 2లో..

### తిరుపతి నుంచి వారణాసికి 25 బైక్‌లు..

## టీడీపీ నేతల సేవా సంకల్ప యాత్ర!

### సేవా సంకల్ప యాత్రను ప్రారంభించిన పల్లా శ్రీనివాసరావు



**తిరుపతి, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి నుంచి వారణాసి వరకు చేపట్టిన 'సేవా సంకల్ప యాత్ర'ను ఆయన ప్రారంభించారు. 25 మంది బైక్ రైడర్లు ఈ యాత్రలో పాల్గొంటున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఆదేశాలు, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు టీడీపీ విద్యార్థి విభాగం (టీఎన్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహిస్తున్నారు. తిరుపతిలోని అలిపిరి నుంచి శ్రీవారి ఆశీస్సులతో ప్రారంభమైన ఈ యాత్ర.. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ మీదుగా సాగనుంది. సుమారు ఎనిమిది రోజుల పాటు కొనసాగి అక్టోబర్ 8న వారణాసికి చేరుకోనుంది. ఆయా రాష్ట్రాల్లో భాజపా నాయకులు యాత్రకు స్వాగతం పలకనున్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు, యువ నేతలు కూడా ఇందులో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మిగతా .. 2లో..

## ఏపీలో సర్ గడువు పొడిగింపు

### అధికారులకు కీలక ఆదేశాలు

**అమరావతి, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమ గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి పొడిగించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం, తుది ఓటర్ల జాబితాను 2026 అక్టోబర్ 16న ప్రచురించనున్నారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ అక్టోబర్ 9న పూర్తి కావాల్సి ఉండగా, తాజాగా మరో వారం పాటు గడువు పెంచడం గమనార్హం. కొత్త షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల జాబితాపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార గడువును అక్టోబర్ 10 వరకు పొడిగించారు. ఈ గడువులోగా వచ్చిన అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఈసీ ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న విచారణలు (హియరింగ్‌లు), ముఖ్యంగా మిగతా .. 2లో..

## 20 లక్షల ఉద్యోగాల కల్పనే

### లక్ష్యమన్న మంత్రి లోకేశ్

- యువత మార్పు కోరుకుంటోందన్న మంత్రి
- డీఎస్సీపై ఆరోపణలను కొట్టివేసిన లోకేశ్
- అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు ప్రస్తావన
- పెట్టుబడులకు 3ఎస్ విధానం అనుసరిస్తున్నామని వివరణ



**అమరావతి, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్ సౌత్-2026లో సీనియర్ జర్నలిస్టు, ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు.

**యువతకు ఉద్యోగాలే తొలి లక్ష్యం**

యువత తమను అడుగుతున్నది ఒక్కటేనని.. మరిన్ని ఉద్యోగాలు కల్పించాలని కోరుకుంటున్నారని లోకేశ్ చెప్పారు. అందుకే ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విద్యా పాఠ్యాంశాలను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మారుస్తున్నామని, వివిధ రంగాల్లో పెట్టుబడులు తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచుతున్నామని చెప్పారు.

**జెన్-జీ మార్పు కోరుకుంటోంది**

కులం, మతం, ప్రాంతంతో సంబంధం లేకుండా యువతలో మిగతా .. 2లో..

## నా పాస్‌పోర్ట్‌ను మోదీ, అమిత్ షా అడ్డుకుంటున్నారా? : కేఏ పాల్ 2

### మాకు అధికారమిస్తే...

## డ్రగ్స్ రహితంగా పంజాబ్

### కేంద్ర హోం మంత్రి అమిత్ షా



**జలంధర్, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ(భాజపా)కు ఒక్క అవకాశం ఇస్తే.. 2029 డిసెంబరు 31 నాటికి పంజాబ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీనిచ్చారు. 'నషా ముక్త్ పంజాబ్' లక్ష్యంగా.. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడతామని మిగతా .. 2లో..

### సిరిసిల్ల గడీల మీద గురిపెడదాం..

## ఫిరంగులమై పేలుదాం

### సీఎం రేవంత్ రెడ్డి



**సిరిసిల్ల, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల.. ఉరిసిల్లగా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. సిరిసిల్లలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. "ప్రపంచంలోనే ధనిక కుటుంబంగా ఆనాడు నిజాం నవాబుకు పేరుంటే.. ఇవాళ కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని, సిరిసిల్ల ప్రజల ఓట్లను సొమ్ముగా మార్చుకుని రూ.వేల కోట్ల ఆస్తులు సంపాదించుకుని విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. వందల ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించారు. కేటీఆర్‌ను అమెరికా నుంచి దిగుమతి చేసి సిరిసిల్ల ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. 2009 నుంచి 2026 వరకు ఆరుసార్లు ఇక్కడి ప్రజలు గెలిపించారు. అయినా.. ఎందుకు నేత కార్మికుల ఆత్మహత్యలు ఆపలేకపోయారు? గల్ఫ్‌కు వలసపోతున్న కార్మికులను ఎందుకు ఆపలేకపోయారు? మీ కుటుంబాలను ఆదుకోవడానికి అణాపైసా సాయం చేయలేదు. ఒక్క రోజైనా కేసీఆర్ కుటుంబం.. మీ గురించి ఆలోచన చేసిందా? సామాజిక మిగతా .. 2లో..







(మొదటిపేజీ తరువాయి)

# పేదలకు గరిష్ఠ ప్రయోజనం

జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన జూమ్ వేదికగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతి పేద కుటుంబానికి సగటున 4 నుంచి 5 పథకాలు అందుతున్నాయని, స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం వంటి పథకాలన్నింటినీ సమన్వయం చేసి లబ్ధిదారులకు మరింత అండగా నిలవాలని సూచించారు. పేదరికం, ఆర్థిక అసమానతలు లేని నియోజకవర్గాలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని స్పష్టం చేశారు. పీ4 (ప్రజలు-ప్రభుత్వం-ప్రైవేటు భాగస్వామ్యం) మోడల్ అమలు తీరును నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే 11 లక్షల బంగారు కుటుంబాలకు మార్గదర్శకులు పీ4 కార్యక్రమం కింద చేయూతనిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పాలనలో సాంకేతికతను జోడించడం ద్వారా పౌర సేవలను మరింత సులభతరం చేయవచ్చని సీఎం పేర్కొన్నారు. సేవలను సమర్థంగా అందించడం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూల దృక్పథం (పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్) పెరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులతో పాటు ప్రతి ఉద్యోగికి కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్లు, నోడల్ అధికారులు క్షేత్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, తమ ప్రభుత్వం పొలిటికల్ గవర్నెన్స్‌కే అత్యంత ప్రాధాన్యమిస్తుందని స్పష్టం చేశారు. డ్వాక్రా మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం 'స్వయం బ్రాండ్'ను ప్రోత్సహిస్తున్నామని, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వివరించారు. పల్లె పండుగ-3.0 ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆస్తులు కల్పించబడతాయని, అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత తప్పనిసరి అని ఆదేశించారు. ఏటా అక్టోబర్ 2వ తేదీన రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో 'స్వచ్ఛాంధ్ర అవార్డులు' ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. ద్రవ్యోల్బణ భారం ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రైతు బజార్లలో తక్కువ ధరకు ఉల్లిని అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ఆదర్శంగా నిలపడమే తమ అంతిమ లక్ష్యమని, ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని సీఎం పిలుపునిచ్చారు.

**మహిళలకు ఏసీ బస్సుల్లోనూ**

# ఉచిత ప్రయాణం : చంద్రబాబు

రాష్ట్రవ్యాప్తంగా 26,401 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎన్టీఆర్ జిల్లాలో లబ్ధిదారులకు సగటున 130 గజాల స్థలానికి పట్టాలు అందించినట్లు చెప్పారు. ఇది పేదల ఆత్మగౌరవానికి కట్టబెట్టిన పట్టాభిషేకమని, వారి చిరకాల వాంఛను నెరవేర్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో డబుల్ ఇంజన్ సర్కార్ ఇప్పుడు జెట్ స్పీడ్‌తో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తోందని చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని, కూటమి ప్రభుత్వం ప్రతీ పేదవాడికి న్యాయం చేసేందుకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు విశాఖ, మంగళగిరి, విజయవాడ కార్యక్రమాలతో కలిపి సుమారు 60,000 పట్టాలు పంపిణీ చేశామని, వాటి విలువ సుమారు రూ.52,000 కోట్లు ఉంటుందని వివరించారు. లబ్ధిదారులు ఈ ఆస్తిని అమ్ముకోవద్దని, భవిష్యత్ కోసం కాపాడుకోవాలని సూచించారు. మహిళల కోసం 'స్త్రీ శక్తి' పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో ఏసీ బస్సులను కూడా కొనుగోలు చేసి వాటిలోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

# 'బాబాయ్ హత్యతో అబ్బాయికే లాభం'

నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిమ్మల మాట్లాడారు. సునీల్ యాదవ్ కోర్టులో తనకు ప్రాణహాని ఉందని చెప్పినా తాడేపల్లి ప్యాలెస్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తనను కాకుండా అంతిమ లబ్ధిదారులైన జగన్, అవినాష్‌రెడ్డి కుటుంబ సభ్యులను విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని సునీల్ చెప్పినట్లు తెలిపారు. వివేకా హత్య కేసుతో సంబంధం ఉన్న పలువురు కీలక వ్యక్తులు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడంపైనా మంత్రి ప్రశ్నలు లేవనెత్తారు. కసనూరు శ్రీనివాస్‌రెడ్డి, ఈసీ గంగిరెడ్డి, కువైట్ గంగాధర్‌రెడ్డి, డ్రైవర్ నారాయణ, వైఎస్ అభిషేక్‌రెడ్డి, వాచ్‌మెన్ రంగయ్య తదితరుల మరణాలపై సమాధానాలు రావాల్సి ఉందన్నారు. హత్యకు రూ.40 కోట్ల సుపారీ ఇచ్చినట్లు వచ్చిన అంశాన్ని కూడా నిమ్మల ప్రస్తావించారు. అంత పెద్ద మొత్తాన్ని ఇచ్చే ఆర్థిక సామర్థ్యం ఎర్ర గంగిరెడ్డి, శివశంకర్‌రెడ్డికి లేదని.. రాజకీయంగా లబ్ధి పొందిన జగన్ కుటుంబానికే ఆ సామర్థ్యం ఉందని ఆరోపించారు. సుపారీకి సంబంధించిన నగదులో రూ.40 లక్షలను ఈడీ అటాచ్ చేసిందని చెప్పారు. హత్య జరిగిన రోజు తెల్లవారుజామునే వివేకానందరెడ్డి చనిపోయిన విషయం జగన్‌కు తెలిసినా.. సాయంత్రం వరకు పులివెందుల వెళ్లకుండా హైదరాబాద్‌లో ఎందుకు ఉన్నారని మంత్రి ప్రశ్నించారు. నాటి ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఘటనాస్థలంలో రక్తపు మరకలను తొలగించి, గుండెపోటుగా ప్రచారం చేయడం ద్వారా ఆధారాలను మార్చేందుకు ప్రయత్నించారని నిమ్మల ఆరోపించారు. గతంలో సీబీఐ దర్యాప్తు కోరిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక విచారణను అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. దస్తగిరి, సునీల్ యాదవ్ వాంగ్మూలాలు, దర్యాప్తు సంస్థల నివేదికలు, గూగుల్ టేక్‌అవుట్ ఆధారాలు, ఈడీ అటాచ్‌మెంట్లు కేసులో కీలకంగా ఉన్నాయని మంత్రి అన్నారు. నిందితులు తనపై ఆరోపణలు చేస్తున్నా జగన్ స్పందించకపోవడం ప్రజల్లో అనుమానాలు పెంచుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా వివేకా హత్యపై జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని నిమ్మల డిమాండ్ చేశారు.

# ఏపీలో కమ్మ, క్రైస్తవ సామాజికవర్గాలదే అధికారం

మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... టీడీపీ, వైసీపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర విభజన హామీలు నెరవేరకపోయినా ఈ రెండు పార్టీలు కేంద్రాన్ని ప్రశ్నించవని, కేవలం పదవుల కోసమే పనిచేస్తాయని ఆరోపించారు. చంద్రబాబు తన కుమారుడిని ముఖ్యమంత్రిని చేయడానికి, జగన్ తన కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికే ప్రాధాన్యత ఇస్తారని సాయిరెడ్డి విమర్శించారు. గత 12 ఏళ్లలో రాష్ట్రానికి రూ.12 లక్షల కోట్ల అప్పు తప్ప ఒక్క కొత్త ప్రాజెక్టు గానీ, యువతకు ఉద్యోగాలు గానీ రాలేదని అన్నారు. ఒక పార్టీకి కుల పిచ్చి, మరో పార్టీకి మత పిచ్చి పట్టుకుందని దుయ్యబట్టారు. తాను పెట్టబోయే కొత్త పార్టీ అధికారంలోకి వచ్చినా తాను సీఎం కాబోనని, అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. రాజధాని మార్పు అవివేకమని, అమరావతిని అన్ని కులాలు, మతాల రాజధానిగా అభివృద్ధి చేయాలని తాను కోరుకుంటున్నానని స్పష్టం చేశారు. విశాఖను రాజధాని చేస్తామని చెప్పి మాట తప్పిన వైసీపీ... ఉత్తరాంధ్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'మావిగన్' అంటూ జగన్ ఇప్పుడు యూటర్న్ తీసుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. లిక్కర్ స్కామ్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని, రాజ్ కెశిరెడ్డి వల్లే ఆ వ్యవహారం జరిగిందని విజయసాయి రెడ్డి తెలిపారు. సజ్జల రామకృష్ణారెడ్డి తనను జగన్ వద్ద విలన్‌గా చిత్రీకరించి పార్టీకి నష్టం చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ అధికారంలోకి వచ్చాక కుట్రలతో తనను పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే కొత్త పార్టీ పేరును ప్రకటించి, ఆ తర్వాత పాదయాత్ర చేపడతానని ఆయన వెల్లడించారు.

# మేధావులు, విద్యావేత్తలపై మోదీ అక్కసు

మొదలైందని ఆరోపించారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన కుల నిర్మూలన, జ్యోతిబా ఫులే రచించిన గులాంగిరి పుస్తకాలు విషం ఎక్కిస్తున్నాయని ఆ అనామక పోస్టులో పేర్కొన్నారని, దానిని పరిగణనలోకి తీసుకుని ప్రధాని కార్యాలయం జోక్యం చేసుకోవడం దారుణమని రాహుల్ వ్యాఖ్యానించారు. "అనామక పోస్టు వచ్చిన మరుసటి రోజే ప్రధాని కార్యాలయం ఆదేశాలతో కేంద్ర విశ్వవిద్యాలయాల్లో సిలబస్ గురించి, ఆ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థుల గురించి కేంద్ర విద్యాశాఖ సమాచారం కోరింది. ఇది షాక్‌కు గురిచేసే అంశం. పేపర్ లీక్‌లు, నిరుద్యోగం, యువత భద్రత గురించి మాట్లాడని ప్రధాని.. ఆన్‌లైన్‌లో వచ్చిన ట్రోల్స్‌పై వెంటనే స్పందించడం దిగ్భ్రాంతికరం" అని రాహుల్ పేర్కొన్నారు.

# డ్రగ్స్ రహితంగా పంజాబ్

ప్రకటించారు. బుధవారం పంజాబ్‌లో పర్యటించిన ఆయన ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వం మత్తు పదార్థాలను రాష్ట్రంలో స్వేచ్ఛగా విక్రయించే వీలు కల్పించిందని దుయ్యబట్టారు. ఈశాన్య రాష్ట్రాలతోపాటు, కశ్మీర్‌లోనూ నక్సలిజం, టెర్రరిజాన్ని నిర్మూలించామని, ఒక్క అవకాశమిస్తే..పంజాబ్‌నూ మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా మారుస్తామని తెలిపారు. ఈ మేరకు జలంధర్‌లోని పరగ్‌పుర్‌లో బుధవారం జరిగిన 'నషా ముక్త్ పంజాబ్ యాత్ర'లో అమిత్ షా వెల్లడించారు.

# టీడీపీ నేతల సేవా సంకల్ప యాత్ర!

మాట్లాడుతూ ప్రజా జీవితంలో నిబద్ధతతో పనిచేసే నాయకత్వానికి నరేంద్ర మోదీ, చంద్రబాబు నాయుడు నిదర్శనమని అన్నారు. సమాజ నిర్మాణం, ప్రజా సేవ కోసం నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడుల ఆకర్షణకు కృషి చేస్తున్నామని పల్లా తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యమని చెప్పారు. మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను గుర్తిస్తూ నిర్వహిస్తున్న ఈ యాత్రలో భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు. యాత్రలో పాల్గొంటున్న బైక్ రైడర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఏపీలో సర్ గడువు పొడిగింపు

నో-మ్యాపింగ్, లాజికల్ డిస్క్రిపెన్సీ కేసులు, ఫారం 6, 7, 8 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో ఈ పొడిగింపు ఇచ్చినట్లు పేర్కొంది. కాగా, 2026 జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించిన విషయం తెలిసిందే. మారిన తేదీల వివరాలను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఈసీ అధికారులను సూచించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మేఘాలయ వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా ఓటర్ల జాబితా సవరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది.

# 20 లక్షల ఉద్యోగాల కల్పనే

కొత్త మార్పు కనిపిస్తోందని లోకేశ్ అన్నారు. వ్యవస్థలో మార్పులు రావాలని కోరుకుంటున్న యువత ఒక వర్గంగా ముందుకు వస్తోందని చెప్పారు. యువతతో కలిసి సమస్యలకు పరిష్కారాలు వెతకడం తనకు ఉత్సాహాన్నిస్తోందన్నారు.

**డీఎస్సీపై ఆరోపణలు.. సర్టిఫికెట్లపై క్లారిటీ**

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్షను పారదర్శకంగా నిర్వహించామని లోకేశ్ తెలిపారు. క్రీడా కోటాలో ఎంపికైన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలే జారీ చేశారని చెప్పారు. ఈ అంశంపై కోర్టు, సీబీఐ దర్యాప్తు కోరినా.. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

**అమరావతిలో 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్**

క్వాంటమ్ టెక్నాలజీ ఊహ కాదని.. ఇది నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ అని లోకేశ్ అన్నారు. తొలి 156 బిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. పరిశోధనలు, మెటీరియల్ సైన్స్, క్రయోజెనిక్ టెక్నాలజీ వంటి రంగాల్లో పని చేస్తూ క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలనుకుంటున్నామని చెప్పారు.

**విద్యా వ్యవస్థలో సమూల మార్పులు**

విద్యా వ్యవస్థ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మారాలని లోకేశ్ అన్నారు. గత రెండేళ్లలో 16 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. ఏఐ నుంచి క్వాంటమ్ వరకు భవిష్యత్ టెక్నాలజీలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలకు కనీసం దశాబ్ద కాలం పడుతుందని పేర్కొన్నారు.

**పెట్టుబడులకు '3ఎస్' మంత్రం**

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకొచ్చేందుకు స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే 3ఎస్ విధానాన్ని అనుసరిస్తున్నామని లోకేశ్ చెప్పారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వడం, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులకు తెలియజేయడం, ప్రభుత్వాలు మారినా విధానాల్లో స్థిరత్వం ఉండేలా చూడటం తమ విధానమన్నారు. వ్యవసాయం నుంచి క్వాంటమ్ వరకు 23 క్లస్టర్లలో పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

# ఫిరంగులమై పేలుదాం

సమస్యలకు నిలయంగా సిరిసిల్ల మారింది. కార్మికుల కన్నీళ్లు, సంఘాల ఆందోళనలకు నిలయంగా మారింది. సిరిసిల్ల సమస్యలకు నిలయంగా మారలేదు.. మార్చారు. సిరిసిల్ల అంటే సిరులకు నిలయం అని అర్థం. ధైర్యం, దైవం కలిసి.. వెలిసిన ప్రాంతం ఇది. సిరిసిల్ల ప్రజల వేలాది ఓట్లను పచ్చనోట్లుగా మార్చుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ రూ.లక్ష కోట్లు కొల్లగొట్టారు. మానేరు ఇసుక కొల్లగొట్టి కేటీఆర్, రవీందర్‌రావు, సంతోష్‌రావు రూ.వేల కోట్లు దోచుకున్నారు. నేత కార్మికులు, గీత కార్మికులను ఆదుకుంటామన్నారు.. ఏవీ చేయలేదు. వేములవాడ శివయ్య, భద్రాద్రి రామయ్యకు శఠగోపం పెట్టిన వ్యక్తి కేసీఆర్ ఒక్కరే. నేత కార్మికుల కోసం పదేళ్లలో బీఆర్ఎస్ రూ.2,234 కోట్లు ఖర్చు చేస్తే... రెండున్నర సంవత్సరాల ప్రజాపాలనలో రూ.1731 కోట్లు ఇచ్చాం. రెండున్నరేళ్లలో ఈ జిల్లాకు రూ.1700 కోట్ల నిధులు ఇచ్చాం. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్ల గడీని బద్దలు కొడదాం. సిరిసిల్ల గడీల మీద గురిపెడదాం.. ఫిరంగులమై పేలుదాం. ఇదే కాంగ్రెస్ కార్యకర్తల ప్రతిజ్ఞ. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పద్మశాలి బిడ్డను మండలికి పంపాలి. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసిన మొనగాడిని మంత్రివర్గంలోకి తీసుకోవాలి. రేవంత్, మహేశ్ గౌడ్.. జోడీ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను రెండోసారి అధికారంలోకి తీసుకొస్తుంది" అని సీఎం అన్నారు. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**నా పాస్‌పోర్ట్‌ను మోదీ, అమిత్ షా**

# అడ్డుకుంటున్నారా?

**వాషింగ్టన్ నుంచి కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు**
**పాస్‌పోర్ట్ రెన్యువల్ ఆలస్యంపై మోదీ సర్కారుకు కేఏ పాల్ ప్రశ్న**
**తన నోరు విప్పితే ఇబ్బందులు తప్పవని హెచ్చరిక**



**సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై సంచలన ఆరోపణలు చేశారు. తన పాస్‌పోర్ట్ రెన్యువల్ చేయవద్దని వారేమైనా ఆదేశాలు జారీ చేశారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహం ముందు నిలబడి రికార్డ్ చేసిన ఒక వీడియోలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మూడు నెలల క్రితం పాస్‌పోర్ట్ రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్నా, ఇప్పటికీ రాకపోవడం షాక్‌కు గురిచేసిందని పాల్ తెలిపారు. మోదీ, అమిత్ షా తనకు మంచి మిత్రులని చెబుతూనే, ఈ జాప్యం వెనుక వారి ఆదేశాలు ఉన్నాయా? లేక విదేశాంగ మంత్రి జైశంకర్ ఏమైనా చెప్పారా? అని అనుమానం వ్యక్తం చేశారు. తాను భారత్‌కు వస్తున్నాననే కారణంతో గానీ, ఎఫ్‌సీఆర్ఏ సమస్యల వల్ల గానీ తన పాస్‌పోర్ట్‌ను అడ్డుకుంటున్నారా? అని ఆయన నిలదీశారు. 2024 ఎన్నికల ప్రచారం సందర్భంగా విజయనగరంలో తనపై నమోదైన కేసును కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆ ఘటనలో ఒక యువకుడు చనిపోతే, నిరసన చేస్తున్న వారిని తాను సముదాయించి పంపించానని, మంచి పని చేసినా తనపై కేసు పెట్టారని పాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కేసు ఇంకా కొట్టివేయలేదని, దాని కారణంగానే పాస్‌పోర్ట్ నిలిపివేశారా? అని ప్రశ్నించారు. ఈ 'చిన్న' విషయంపై తాను ఎక్కువగా మాట్లాడదలచుకోలేదని, తాను నోరు విప్పితే అనవసర సమస్యలు వస్తాయని మోదీ, అమిత్ షాలను హెచ్చరించారు. న్యాయపరమైన చర్యలు తీసుకునేలోపే తన పాస్‌పోర్ట్‌ను తిరిగి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలు.. సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

**అక్టోబర్ 11 నుంచి 20 వరకు ఉత్సవాలు - క్యాంపు కార్యాలయంలో ఆహ్వానపత్రిక అందజేత**
**సీఎంకు అమ్మవారి ప్రసాదం, వేదాశీర్వచనం - ఉత్సవాల ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్న సీఎం**
**భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశం**

**అమరావతి, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఈ నెల 11 నుంచి 20 వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి ప్రసాదాన్ని అందించి, వేదాశీర్వచనం పలికారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లపై చంద్రబాబు ఆరా తీశారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



# రాజస్థాన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలి : హరీశ్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** సింగరేణి ఆధ్వర్యంలోని జైపూర్ విద్యుత్ విషయంలో రాజస్థాన్‌తో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఒకవైపు కరెంటు లేక రైతుల పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే, మరోవైపు మన రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు ధారాదత్తం చేసేందుకు సిద్ధపడటం ప్రజా వ్యతిరేక చర్య కాక మరేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు కావాల్సిన బొగ్గు మన సింగరేణి గనుల్లోనే ఉంది... నడపడానికి కావాల్సిన నీళ్లు పక్కనే ఉన్న గోదావరి నుంచే పుష్కలంగా అందుతాయి. బొగ్గు మనది, నీళ్లు మనవి, స్థలం మనది... అలాంటప్పుడు ఇక్కడ కొత్తగా చేపడుతున్న విస్తరణలో 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు కట్టబెట్టేలా జాయింట్ వెంచర్ ఒప్పందం చేసుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటి? మన బొగ్గు, మన నీళ్లు, మన ప్రాంతంలో తయారయ్యే కరెంటుపై హక్కు తెలంగాణదే కదా. ఇటీవల సింగరేణి సంస్థ రాజస్థాన్‌కు చెందిన ఆర్ఆర్వీయూఎన్ఎల్ విద్యుత్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం కొత్తగా నిర్మించే థర్మల్ విద్యుత్‌లో 800 మెగావాట్లు రాజస్థాన్‌కు కేటాయిస్తారు" అని హరీశ్‌రావు లేఖలో పేర్కొన్నారు.. తెలంగాణ ప్రజల ఆస్తి సింగరేణి... అలాంటి సింగరేణి విద్యుత్‌ను, పెట్టుబడిని రాజస్థాన్ అభివృద్ధికి ఎందుకు మళ్లించాలని ప్రశ్నించారు.

# ఎడిటర్ వాయిస్

## ఆమంచి రూట్ మార్చేశారు.. సక్సెస్ అయ్యేనా.. ?

ఆమంచి కృష్ణమోహన్.. చీరాల మాజీ ఎమ్మెల్యే. కాపు సామాజిక వర్గానికి చెందిన ఫైర్ బ్రాండ్ నాయకుడు. ప్రస్తుతం ఆయన కాంగ్రెస్‌పార్టీలోనే ఉన్నారు. అయితే.. గతానికి భిన్నంగా ఇప్పుడు రూట్ మార్చేశారనే చర్చ జరుగుతోంది. ప్రజల సమస్యలపై ఒకప్పుడు నిరసనలు, ఆందోళనలు.. తన ఇంట్లోనే పంచాయతీలు పెట్టిన ఆమంచి.. ఇప్పుడు న్యాయ పోరాటాలకు దిగారు. ఆయన హైకోర్టులో పిటిషన్లపై పిటిషన్లు వేస్తూ.. సమస్యలు వెలుగులోకి తీసుకువస్తున్నారు.

ప్రస్తుతం ఇసుక, మైనింగ్ అక్రమాలు జోరుగా సాగుతున్నాయంటూ.. హైకోర్టులో నాలుగు పిటిషన్లు ఆమంచి నేరుగా వేశారు. దీనిలో ఆయన పేరును కూడా ప్రస్తావించారు. అక్రమాలను అరికట్టాలని.. ఆయన కోరుతున్నారు. దీనిని హైకోర్టు కూడా సీరియస్‌గానే తీసుకుంది. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అయితే.. ఈ ప్రత్యేక శైలి ఏమేరకు సక్సెస్ అవుతుందన్నదే ఇప్పుడు ప్రశ్న. ప్రజలను ఆదరువుగా చేసుకుని రాజకీయాలు చేసిన ఆమంచి ఇప్పుడు కోర్టుకు వెళ్లడం కొంత వరకు కొత్తగానే ఉంది.

ఇదే సమయంలో ఆయన వేస్తున్న అడుగులు ప్రజల్లోకి చేరుతాయా ? చేరినా..ఆయనకు అనుకూలంగా మారుతాయా ? అనేది ప్రశ్న. ప్రస్తుతం ఉన్న పరిణామాలను గమనిస్తే.. చీరాల నియోజకవర్గంలో ఆమంచి వర్గం పెద్దగా దూకుడు లేదు. పైగా అన్నదమ్ముల మధ్యే రాజకీయ విభేదాలు నడుస్తున్నాయి. ఆమంచి స్వాములు.. జనసేనను వీడిన తర్వాత.. ఇప్పుడు ఏ పార్టీలోనూ చేరలేదు. దీంతో ఆయన సైలెంట్ అయ్యారు. ఆమంచి కృష్ణమోహన్ కాంగ్రెస్‌లోనే ఉన్నా.. పెద్దగా యాక్టివ్ పాలిటిక్స్ చేయడం లేదు.

ఈ క్రమంలో ఆయన కోర్టును ఆశ్రయించడం.. అక్రమాలపై నిలదీయడం వంటివి రాజకీయంగా ఆమంచికి ఏమేర కు మేలు చేస్తాయన్న వాదన కూడా వినిపిస్తోంది. మాస్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న ఆమంచి.. ప్రజలకు చేరువ కావాల్సిన అవసరం ఉందని ఆయన అనుచరులు కోరుతున్నారు. కానీ, వ్యక్తిగత కారణాలతో ఆమంచి ఈ విషయంలో వెనుకడుగు వేస్తుండడం గమనార్హం. మరి న్యాయ పోరాటాలు ఏమేరకు ఆయనకు ఓటు బ్యాంకును పెంచుతాయో చూడాలి.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## అనుమతి లేని నిర్మాణం కూల్చకుండా లంచం డిమాండ్

### అనిశాకు చిక్కిన టౌన్‌ప్లానింగ్ ఇన్‌ఛార్జి, రెవెన్యూ అధికారి



మొయినాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : అనుమతుల్లేకుండా చేపట్టిన ఇంటి నిర్మాణాన్ని కూల్చకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేసిన టౌన్‌ప్లానింగ్ ఇన్‌ఛార్జితోపాటు రెవెన్యూ అధికారిని అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హైదరాబాద్ సిటీ రేంజ్ అనిశా డీఎస్పీ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం...వికారాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారిణిగా పనిచేస్తున్న గుండు వాణి.. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి మున్సిపాలిటీలతోపాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. మొయినాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టారు. పనులు చివరిదశలో ఉండగా.. టౌన్‌ప్లానింగ్ అధికారిణి గుండు వాణితోపాటు రెవెన్యూ అధికారి సుదర్శన్ ఇటీవల అక్కడికి వెళ్లారు. అనుమతులు లేకపోవడంతో కూల్చకుండా ఉండేందుకు రూ.లక్ష లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యాలయానికి పిలిపించుకుని బాధితుడిని బెదిరించారు. రూ.లక్ష ఇవ్వలేనని బాధితుడు ప్రాధేయపడడంతో రూ.75 వేలకు ఒప్పందం కుదిరింది. దీంతో బాధితుడు అనిశాను ఆశ్రయించారు. బుధవారం మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయంలో బాధితుడి నుంచి రూ.75వేలు లంచం తీసుకుంటుండగా అక్కడే మాటువేసి ఉన్న అనిశా అధికారులు పట్టుకున్నారు.

## అరేబియా సముద్రంలో రూ.3వేల కోట్ల డ్రగ్స్ స్వాధీనం

### ఐదుగురు పాకిస్థానీల అరెస్టు



దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ : అరేబియా సముద్రం మీదుగా భారత్‌కు భారీ మొత్తంలో డ్రగ్స్‌ను తరలిస్తున్న ఐదుగురు పాకిస్థానీలను ఇండియన్ కోస్ట్ గార్డ్ దళాలు అరెస్టు చేశాయి. భారత కోస్ట్‌గార్డ్, గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో ఇరాన్‌కు చెందిన ఓ పడవ నుంచి భారీగా మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం వెల్లడించారు. మొత్తం 526 కిలోల మెథాంఫెటమైన్, హెరాయిన్‌ను జప్తు చేశామని, వీటి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.3,000 కోట్లకు పైగా ఉంటుందని తెలిపారు. సెప్టెంబరు 25న లక్షద్వీప్‌నకు పశ్చిమాన అరేబియా సముద్రంలో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు భారత కోస్ట్ గార్డ్ తెలిపింది. అనుమానాస్పదంగా కదులుతున్న ఓ పడవను భద్రతా బలగాలు తొలుత గుర్తించాయి. సముద్ర, వైమానిక నిఘా వ్యవస్థల ద్వారా పడవ కదలికలను నిరంతరం పర్యవేక్షించిన అధికారులు, అనంతరం దాన్ని వెంబడించారు. కోస్ట్ గార్డ్ సిబ్బంది అందులోకి ప్రవేశించి మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.

## మల్లేశ్ దగ్గర మరో 810 తూటాలు

### ఆర్మీ ఆయుధాల అపహరణ కేసులో కీలక పరిణామం

### చోరీకి ఐదుగురి సహకారం.. వారిలో ఇద్దరు ఆర్మీ ఉద్యోగులు

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ కేసులో మరో కీలక పరిణామమిది. ఈ కేసులో నిందితుడైన మాజీ హవల్దార్ ఉప్పుతోళ్ల మల్లేశ్ ఎలియాస్ రాజును పోలీసులు సెప్టెంబరు 11న అరెస్టు చేసి ఆయుధాలు, తూటాలను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇవిగాక మల్లేశ్ దగ్గర మరో 810 తూటాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ తూటాలను చోరీ చేసి రహస్య ప్రాంతంలో దాచినట్లు దర్యాప్తులో వెలుగు చూడటంతో పోలీసులు తాజాగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. తొలుత ఆర్మీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదులోని వివరాల ప్రకారం.. మద్రాస్ రెజిమెంట్‌లో 12 తుపాకులు, 21 మ్యాగజైన్లు, ఒక నైట్ విజన్ బైనాక్యులర్, 1,912 తూటాలు చోరీ అయ్యాయి. మద్రాస్ రెజిమెంట్‌కు చెందిన ఉన్నతాధికారితో గతేడాది గొడవ, కొంతకాలం సర్వీసు ఉండగానే ఉద్వాసనకు గురవడంతో నిందితుడు ఈ పనిచేసినట్లు ఇప్పటికే గుర్తించారు. తాజాగా రెండో దఫా భారీ స్థాయిలో తూటాలు లభ్యమవడంతో చోరీ వెనుక కుట్ర ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఆయుధాల అపహరణలో మల్లేశ్‌కు మరో ఐదుగురు సహకరించినట్లు పోలీసుల దర్యాప్తులో బయటపడింది. ఈ ఐదుగురిలో ఇద్దరు ఆర్మీ ఉద్యోగులు కాగా.. ముగ్గురు బయటివారు. మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీపై లెఫ్టినెంట్ కర్నల్ మయాంక్ గోవిటిర్కార్ ఇచ్చిన ఫిర్యాదుతో బొల్లారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 11న నిందితుడు మల్లేశ్‌ను అరెస్టు చేశారు. పోలీసులు సాంకేతిక ఆధారాలను పరిశీలించినప్పుడు మరికొందరి ప్రమేయం కూడా ఉన్నట్లు తేలింది. పదిరోజుల కస్టడీలో భాగంగా సెప్టెంబరు 22న మల్లేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అతనిచ్చిన సమాధానాల ఆధారంగా గతవారం మొత్తం 8 మందిని విచారించారు. చివరికి ఐదుగురు సహకరించినట్లు గుర్తించారు. ఇందులో మద్రాస్ రెజిమెంట్‌లోని కోట్ దగ్గర విధులు నిర్వహించే వినోద్, శేషు ఉన్నారు. పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. మల్లేశ్‌తో వినోద్ ఆర్థిక లావాదేవీలను గుర్తించారు. విచారణలో మిలిటరీ ఇంటెలిజెన్స్‌కు చెందిన మేజర్ స్థాయి అధికారి ఒకరు పాల్గొంటున్నారు. మల్లేశ్ ఆయుధాలు ఎలా చోరీ చేశాడో తెలుసుకోవడానికి పోలీసులు సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయించారు.



# విశ్వవాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




గురువారం, 01 అక్టోబర్, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత

www.viswamvoice.com


రూ.1.78 కోట్లతో రామచంద్రపురం పట్టణంలో

## 13 అభివృద్ధి పనులకు మంత్రి సుభాష్ శంకుస్థాపనలు

**పట్టణ సుందరీకరణ, మౌలిక సదుపాయాల కల్పనకే కూటమి ప్రభుత్వం పెద్దపీట**

**ప్రజలకు మెరుగైన వసతులే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో రూ.1.78 కోట్లు వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసి చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ కెవిఆర్ఆర్ రాజు లు శంకుస్థాపనలు చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, ప్లాన్ గ్రాంట్, రుడా నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పట్టణాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రామచంద్రపురం పట్టణాన్ని మరింత సుందరంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య సదుపాయాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన అనేక ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

**వార్డు వారీగా చేపట్టనున్న అభివృద్ధి పనులు**

**20వ వార్డు - రూ.39.46 లక్షలు**

కమ్మవారి సావరం నారాయణ కళాశాల నుండి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు ఆర్‌సీసీ డ్రెయిన్ నిర్మాణం.

వెంకటేశ్వరస్వామి ఆలయం నుండి నెక్కంటి వీర వెంకట సత్యనారాయణమూర్తి నివాసం వరకు ఆర్‌సీసీ డ్రెయిన్ నిర్మాణం.

21వ వార్డు - రూ.44.93 లక్షలు

నెక్కంటి వీర వెంకట సత్యనారాయణమూర్తి ఇంటి నుండి ముచ్చిమిల్లి రోడ్డు వరకు ఆర్‌సీసీ డ్రెయిన్ నిర్మాణం. రత్నంపేటలో ఏపీ గ్రామీణ బ్యాంక్ నుండి బుల్లెట్ నాగేశ్వరరావు వీధి వరకు సీసీ డ్రెయిన్. బుల్లెట్ నాగేశ్వరరావు వీధి నుండి ఫుడ్ హౌస్ వరకు రెండు వైపులా సీసీ డ్రెయిన్ నిర్మాణం. 16వ వార్డు -రూ.8.68 లక్షలు ఓలేటి శ్రీను నివాసం నుండి చామర్తి వంశీ నివాసం వరకు సీసీ రోడ్డు నిర్మాణం.

12వ వార్డు - రూ.4.71 లక్షలు ఆఫిషియల్ కాలనీలో డ్రెయిన్ నిర్మాణం.

18వ వార్డు - రూ.5.89 లక్షలు గంగుమల్లవారి వీధిలో వినాయక ఆలయం వరకు సీసీ డ్రెయిన్ నిర్మాణం.

8వ వార్డు - రూ.9.21 లక్షలు సేనాపతులవారి వీధిలో డ్రెయిన్ మరమ్మతులు, గోడ ఎత్తు పెంపు.

వినాయక ఆలయం పరిసర ప్రాంతాల్లో డ్రెయిన్ నిర్మాణం.

4వ వార్డు - రూ.9.09 లక్షలు. డి.నెం.14-8-50/9 నుండి మోడరన్ కాలేజీ వరకు సీసీ డ్రెయిన్ నిర్మాణం.

2వ వార్డు - రూ.13.76 లక్షలు స్టిల్‌వెల్‌పేటలో చేనేత కార్మిక భవనం మరమ్మతులు. కొత్తూరు రోడ్డులో బాలికల హాస్టల్ వెనుక భాగంలో సీసీ డ్రెయిన్ నిర్మాణం.

1వ వార్డు - రూ.31.86 లక్షలు బాలాజీ ఆలయం నుండి ఎస్‌టిపిపి మున్సిపల్ హైస్కూల్ జంక్షన్ సమీపం వరకు ఆర్‌సీసీ డ్రెయిన్ నిర్మాణం పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, రామచంద్రపురం పట్టణంలో ఇప్పటికే కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని, మరిన్ని పనులను దశలవారీగా చేపట్టి ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి ఈ శ్రీకాంత్, ఏఈ సునీల్, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, గరికపాటి సూర్యనారాయణ, కంచుమర్తి బాబురావు, కట్టా నాగేశ్వరరావు, అక్కల రాగూర్, కడియాల రాఘవన్, సంపత్ సత్యనారాయణమూర్తి, చందాల మల్లిబాబు, చింతాకుల ప్రకాష్, చిక్కాల బాబ్జి, సంధ్యారాణి, దోమ్మలపాటి విజయలక్ష్మి రాజశేఖర్, సవరం సుధీర్, అల్లం శ్రీనివాస్, అంకం శ్రీనివాస్, బల్ల శివ, ఏలూరు ఏసుదాస్, ఆప్కో వెంకట్రావు, గున్నం వినోద్ కుమార్, రిమ్మలపూడి శ్రీనివాస్ చౌదరి, పలివెల జగదీష్, దోమలపాటి లాలి ప్రసాద్, సిరిగినీడి దుర్గాప్రసాద్, పసుపులేటి సత్తిబాబు, బరకాటి రాంబాబు, అధికారులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కరప జడ్పీ హైస్కూల్ నూతన విద్యా కమిటీ ఎన్నిక..

**చైర్మన్‌గా జెల్ల శివకుమార్, వైస్ చైర్మన్‌గా తూటా కనకమహాలక్ష్మి**



**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం కరప గ్రామం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్) నూతన విద్యా కమిటీ (ఎస్ఎంఎస్) ఎన్నిక మంగళవారం పాఠశాల ప్రాంగణంలో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్‌గా జెల్లా శివకుమార్, మరియు వైస్ చైర్మన్ కనక మహాలక్ష్మిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాఠశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా నూతన కమిటీని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యా ప్రమాణాల మెరుగుదలకు నూతన కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను కూటమి నాయకులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

## గుండె వ్యాధులపై జాగృతం చేయండి



**కాజులూరు, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండలం గొల్లపాలెం పీఎంపీ అసోసియేషన్ భవన్ లో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) కాకినాడ జిల్లా కాజులూరు, కరప మండలాల ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ దినోత్సవం(వరల్డ్ హార్ట్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ వినాయక కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రముఖ వైద్యులు, పీఎంపీ అసోసియేషన్ నాయకులు గుండె వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో కాకినాడ కు చెందిన ఉదయ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ వి అరవింద కుమార్ హాజరై గుండెకు సంబంధించిన ఇబ్బందులు కరోనరీ ఆర్టరీ, హార్ట్ ఎటాక్, హార్ట్ ఫెయిల్యూర్,గుండె ఆగిపోవడం వంటి అంశాల గురించి వివరించారు. ప్రాథమికంగా పీఎంపీలు చేయు సీపీఆర్ గురించి, గుండె వ్యాధులను పీఎంపీలు ఎలా గుర్తించాలి, ఏ విధమైన ప్రాథమిక వైద్యం అందించాలో తెలిపారు. జిల్లా అధ్యక్షులు జేవీవీ సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ప్రతి పీఎంపీ మన చుట్టూ ఉన్న వారందరికీ అధిక రక్తపోటు, మధుమేహం, ధూమపానం ,మద్యపానం వలన,శారీరక శ్రమ లేకపోవడం వలన వచ్చే అనర్థాల గురించి అవగాహన కల్పించాలని, హృదయ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకునేలా జాగృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ద్రాక్షారామ భీమేశ్వర దంత వైద్యశాల వైద్య నిపుణులు డాక్టర్ క్రాంతి కుమార్, కాకినాడ జిల్లా కోశాధికారి కే శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ ఏడుకొండలు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిక్కాల శ్రీనివాస్, జిల్లా గౌరవ సలహాదారులు షేక్ రహ్మాన్ షరీఫ్, కాజులూరు మండల కార్యదర్శి పిఎల్ శ్రీనుబాబు, కోశాధికారి బి రాజేష్ గౌరవ అధ్యక్షులు షేక్ మస్తాన్, ఉపాధ్యక్షులు కె జానకి రామ్ సహాయ కార్యదర్శి ఎస్ సుబ్రహ్మణ్యం తాళ్లరేవు కార్యదర్శి ఆర్ సూర్యనారాయణ కోశాధికారి మోహన్ దేంగేటి ప్రసాద్ మహమ్మద్ గౌస్ ఎం వి వి సత్యనారాయణ మొదలైన సభ్యులు పాల్గొన్నారు.

## ఇటుక ట్రాక్టర్ బోల్తా వ్యక్తి మృతి - ఇద్దరికి గాయాలు



**కోరుకొండ, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం కాపవరం గ్రామానికి చెందిన పిల్లి ప్రసాద్ ట్రాక్టర్ పై ఇటుక తీసుకు వెళుతుండగా దేవుని కోనేరు వద్ద బోల్తా పడటంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా ఇరువురికి గాయాలు అయినట్లు కోరుకొండ ఎస్సై పిశివాజీ తెలిపారు. బుధవారం కోరుకొండ ఎస్సై శివాజీ కథనం ప్రకారం కాపవరం గ్రామానికి చెందిన పిల్లి వరప్రసాద్ ట్రాక్టర్ పై ఇటుక తీసుకు వెళుతుండగా దేవుని కోనేరు వద్ద ట్రాక్టర్ బోల్తా పడి సోడాసాని ప్రసాద్(40) అక్కడికక్కడే మృతి చెందారన్నారు. ఆయనకు భార్య,ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు. మరో ఇరువురికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించమన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం మీద రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించమన్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## పురుషోత్తపట్నం జడ్పీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా వేదుల రాజు

**వైస్ చైర్మన్‌గా పసలపూడి చంద్ర లీల**



**సీతానగరం, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్త పట్నం జడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు జి.సంతోషి మాత ఆధ్వర్యంలో విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో చైర్మన్‌గా వేదుల రాజు, వైస్ చైర్మన్‌గా పసలపూడి చంద్ర లీల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ వేదుల రాజు, వైస్ చైర్మన్ పసలపూడి చంద్రలీల మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు తమ వంతు కృషి చేస్తామని తెలిపా రు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తా మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి,జనసేన,బిజెపి నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు, విద్యా కమిటీ మెంబర్లు,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

## కూటమి మోసపు హామీలపై ప్రజా తిరుగుబాటు తప్పదు

**అక్టోబర్ 5న రాజానగరంలో నిర్వహించే బహిరంగ సభకు తరలిరండి**

**వైఎస్ఆర్సీపీ నాయకుల పిలుపు**



**సీతానగరం, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోం దని, ప్రభుత్వ వైఫల్యా లను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రశ్నించేందుకు అక్టోబర్ 5 నుంచి 'అడుగు' నినాదం తో ప్రజా ఉద్యమాన్ని చేపడతామని వైఎస్ఆ ర్సీపీ నాయకులు తెలిపారు. సీతానగరంలో పార్టీ నాయకుడు పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్ బాబు) స్వగృహంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలోపార్టీ సీనియర్ నాయకుడు చళ్ళమళ్ళ సుజీ రాజు, మండల పార్టీ కో-కన్వీనర్ కరుటూరి హరిబాబు,పార్టీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు డివిజన్ ఇన్‌చార్జి ముదునూరి రామకృష్ణరాజు,సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు కొండ్రుపు ముత్యాలు,మాజీ ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న,డివిజన్ ఇన్‌చార్జి పిచ్చుకుల విజయ్,సీతానగరం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు అంబటి రాజు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు.వైఎస్ఆర్సీపీ రాష్ట్ర వాలంటీర్ విభాగం జాయింట్ సెక్రటరీ పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్ బాబు) మాట్లాడుతూ అక్టోబర్ 5న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు అడబాల చినబాబు, యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి చేకూరి నాని, వలవల వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.








# ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, భద్రతపై రాజీపడే ప్రసక్తే లేదు

## జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ స్పష్టం చేశారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ కాలనీలు, శ్మశాన వాటికలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ, జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు, అదనపు ఎస్పీ మహేంద్ర మత్తెతో కలిసి ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, చట్టాల అమలు, అట్రాసిటీ కేసుల పురోగతి, మౌలిక వసతులు, విద్యార్థుల భద్రత, సంక్షేమ వసతి గృహాలు, విదేశీ ఉపాధికి వెళ్లే యువత సమస్యలపై సమగ్రంగా సమీక్షించారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కేసుల దర్యాప్తు, తదుపరి న్యాయ ప్రక్రియ, బాధితులకు పరిహారం అందజేతలో ఎలాంటి జాప్యం లేకుండా పోలీస్, రెవెన్యూ, సాంఘిక సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అట్రాసిటీ కేసులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయడంతో పాటు బాధితులకు అవసరమైన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అన్నది అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, శ్మశాన వాటికలకు రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులు కల్పించే పనులను సమీక్షించిన కలెక్టర్, ఇప్పటికే మంజూరైన పనులను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి పరిశీలించి నివేదిక సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ శ్మశాన వాటికలు ఆక్రమణలకు గురవుతున్న అంశాన్ని కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ప్రస్తుత భూ పునఃసర్వేలో శ్మశాన వాటికల భూములను స్పష్టంగా గుర్తించి హద్దులు నిర్ణయించి రికార్డుల్లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలు, ఇతర విదేశాలకు వెళ్లిన తల్లిదండ్రుల పిల్లలు, ముఖ్యంగా మైనర్ బాలికల సంరక్షణ, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. విద్యాశాఖకు సంబంధించిన లీప్ యాప్, సమాచార ఆధారంగా అధికారిక సంరక్షకుల పర్యవేక్షణలో ఉన్న బాలికల వివరాలను సేకరించి వారికి అవసరమైన గుర్తింపు కార్డులు కేటాయించాలని తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులను కలిసేందుకు అధికారికంగా గుర్తింపు పొందిన సంరక్షకులను మాత్రమే అనుమతించే విధంగా తగిన విధానాలను అమలు చేయాలని స్పష్టం చేశారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, నాణ్యమైన భోజనం, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతుల విషయంలో రాజీపడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు వసతి గృహాలను తరచూ తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో పరిశీలించి, పనిచేయని కెమెరాలను వెంటనే మరమ్మతు చేయించాలని సూచించారు. నరేంద్రపురం గురుకుల పాఠశాల హాస్టల్ పరిసరాల్లో పాముల బెడద నివారణకు పరిసరాలను తరచూ శుభ్రం చేయాలని సభ్యులు కోరగా, విద్యార్థుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రాజోలు బాలుర హాస్టల్ భవనం కూల్చివేసిన నేపథ్యంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నూతన భవన నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించడంతో పాటు అప్పటివరకు విద్యార్థులకు ప్రత్యామ్నాయ వసతులు కల్పించాలని కోరారు. ఈ అంశంపై సంబంధిత ప్రజాప్రతినిధులతో చర్చించి ప్రత్యామ్నాయ వసతులు, నూతన భవన నిర్మాణానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కోనసీమ జిల్లా నుంచి గల్ఫ్ దేశాలు, ఇతర విదేశాలకు ఉపాధి కోసం వెళ్లే యువత ప్రైవేట్ ఏజెంట్ల చేతిలో మోసపోకుండా జిల్లా స్థాయిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఏజెంట్ల కారణంగా పాస్‌పోర్టుల్లో వయస్సు తదితర వివరాల్లో తేడాలు ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కారం చూపాలని కోరారు. విదేశీ ఉపాధి పేరుతో జరిగే మోసాలపై యువతకు ముందస్తుగా అవగాహన కల్పించాలని సూచించారు. అమలాపురం, కొత్తపేట తదితర ప్రాంతాల్లోని సబ్‌జైళ్ల ప్రస్తుత పరిస్థితిపై క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్డీవోలు, డీఎస్పీలు సంయుక్తంగా పరిశీలించి 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని సూచించారు. సబ్‌జైళ్లలో ఖైదీల సంఖ్య, అందుబాటులో ఉన్న వసతులు, సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించడంతో పాటు రిమాండ్ ఖైదీలను రాజమహేంద్రవరానికి తరలించడంలో ఉన్న సాధ్యాసాధ్యాలను కూడా సమగ్రంగా అధ్యయనం చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. సఖినేటిపల్లి మండలాన్ని రాజోలు సాంఘిక సంక్షేమ అధికారి పరిధిలోకి, మామిడికుదురు మండలాన్ని అమలాపురం సాంఘిక సంక్షేమ అధికారి పరిధిలోకి తీసుకురావడం ద్వారా పరిపాలనా సౌలభ్యం కల్పించాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ అంశాన్ని పరిశీలించి నిబంధనల మేరకు తగిన నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఆలమూరు హాస్టల్ విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు వ్యాన్ సౌకర్యం కల్పించాలని సభ్యులు కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి నెల 30వ తేదీన అన్ని మండలాల్లో పౌర హక్కుల దినోత్సవాన్ని బాధ్యతాయుతంగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తహశీల్దార్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కులు, చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ కోరారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాల్లో సభ్యులు, ప్రజాప్రతినిధులు ప్రస్తావించే సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, శ్మశాన వాటికలకు రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పించడంతో పాటు హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు అందించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థినుల భద్రత, సంక్షేమ వసతి గృహాల్లో పరిశుభ్రత, నాణ్యమైన భోజనం వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గత సమావేశాల్లో సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై తీసుకున్న చర్యలను సమావేశంలో సమీక్షించారు. ఎస్సీ హాస్టళ్లలో బాత్‌రూమ్‌ల మరమ్మతులు, అట్రాసిటీ కేసులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాల జారీని వేగవంతం చేయడం వంటి అంశాలపై తీసుకున్న చర్యలను సభ్యులు ప్రస్తావించారు. సమావేశంలో ప్రస్తావించిన ప్రతి సమస్యను సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో తీసుకుని నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, భద్రత, విద్య, ఉపాధి, మౌలిక వసతులు, హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాల్లో శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో అమలాపురం, కొత్తపేట ఆర్డీవోలు ఎం. సరళావతి, జి.వి. సత్యనారాయణ, డీఎస్పీలు టి.వి.కె. ప్రసాద్, ఎస్. మురళీమోహన్, సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకుడు వెంకటకృష్ణ, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి జి. మమ్మీ, జిల్లా విద్యాశాఖ అధికారి మహబూబ్ బాషా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి డి. రాంబాబు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవ వర్మ, జిల్లా పౌరసరఫరాల అధికారి విజయభాస్కర్, డ్వామా పీడీ రామ్ గోపాల్, ఐసీడీఎస్ పీడీ బి. శాంతికుమారి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పుణ్యమంతుల రజని, చిన్న అప్పారావు, జె. శ్రీనివాసరాజు, మోహన్ కుమార్ దాడి, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురం మున్సిపాలిటీకి స్కోచ్ అవార్డు గర్వకారణం

## మున్సిపల్ కమిషనర్, సిబ్బందికి ఘన సత్కారం

**అమలాపురం, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పురపాలక సంఘానికి కేంద్ర స్థాయిలో ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించడం పట్టణ ప్రజలకు గర్వకారణమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం అమలాపురం కాపు కళ్యాణ మండపంలో ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆనందరావును, మున్సిపల్ కమిషనర్ నిర్మల కుమార్‌ను, పురపాలక సంఘ సిబ్బందిని ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ అమలాపురం పురపాలక సంఘ చరిత్రలో గతంలో దివంగత నాయకుడు మెట్ల సత్యనారాయణ హయాంలో, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రికార్డు స్థాయిలో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, రాష్ట్ర మంత్రులను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు అందజేసి, అమలాపురం పట్టణానికి భారీగా నిధులు మంజూరు చేయించడంతో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని వివరించారు. అధికారులు, పురపాలక సంఘ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు



అందిస్తున్న నిరంతర సేవలు, పట్టణ ప్రజల సహకారం వల్లే అమలాపురం పురపాలక సంఘానికి కేంద్ర స్థాయిలో స్కోచ్ అవార్డు లభించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్తులో అమలాపురాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ పురపాలక సంఘంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఈ అభినందన సభలో మున్సిపల్ కమిషనర్ నిర్మల కుమార్, పురపాలక సంఘ అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రామచంద్రపురంలో 2.4 కిలోల బంగారం చోరీ కేసు : నలుగురు నిందితుల అరెస్టు

**రామచంద్రపురం, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నుండి రావులపాలెం వెళ్తున్న మహారాష్ట్రకు చెందిన జితేంద్ర సింగ్ రాజ్ పురోహిత్ అనే వ్యక్తిని రామచంద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఐదుగురు దుండగులు తెల్లని స్కార్పియో కారులో వచ్చి కత్తులతో బెదిరించి సుమారు 2.4 కిలోల బంగారాన్ని అపహరించి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు క్రైమ్ నంబర్ 153/2026, సెక్షన్ 308(5) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో భాగంగా తోటపేట, ద్రాక్షారామం పరిధిలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి ఒక బంగారు ఉంగరం, కత్తిని స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. ఈ ఘటనలో మొత్తం ఐదుగురు నిందితులు ఉండగా, నలుగురిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మిగిలిన ఒక్క నిందితుడిని పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

ఈతకోట గ్రామంలో మెయిన్ రోడ్డులో పాఠశాలలు, దేవాలయాల వద్ద

# స్పీడ్ బ్రేకర్లును ఏర్పాటు చేయాలి

## విద్యార్థులు, భక్తులు, ప్రజల భద్రతకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి

## ప్రజాసేవకుడు గంద్రోతు దుర్గాసురేష్



**రావులపాలెం, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం, రోడ్డుపై స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులతో ప్రమాదాలు నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజా సేవకుడు గంద్రోతు దుర్గాసురేష్ అన్నారు మండలం పరిధిలోని ఈతకోట గ్రామంలో మెయిన్ రోడ్డులో పలు ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలు వేగంగా ప్రయాణిస్తుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, భక్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామానికి చెందిన ప్రజాసేవకుడు గంద్రోతు దుర్గాసురేష్ అన్నారు మంగళవారం నాడు ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల వద్ద విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో వేగంగా వచ్చే వాహనాలతో ప్రమాదభయం నెలకొందన్నారు గతంలో అనేక సార్లు ప్రమాదాలు జరిగాయన్నారు ఈ సమస్యను పాఠశాల ఉపాధ్యాయులు సైతం గత ఆగస్టు 15న గ్రామ పెద్దల దృష్టికి తీసుకువచ్చారన్నారు శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామివారి మరియు శ్రీ వేణుగోపాలస్వామివారి దేవస్థానం వద్ద రహదారి వాలుగా ఉండటంతో వాహనాలు వేగంగా వెళ్తున్నాయన్నారు , భక్తుల భద్రత కోసం స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను విద్యార్థులు తల్లి తండ్రులు భక్తులు కోరుతున్నారన్నారు. శ్రీ ఎరిణమ్మతల్లి అమ్మవారి ఆలయం పరిధిలోని రెండు జంక్షన్ల వద్ద,ఈతకోట నుండి దేవరపల్లి గంటి వెళ్లే మార్గం జంక్షన్ వద్ద ఇరుకైన మలుపులు, భారీ వాహనాల రాకపోకల కారణంగా ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని, ఇటీవల చిన్నపాటి ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ సమస్యలపై ఇప్పటికే స్పందన (గ్రీవేన్స్ )లో ఫిర్యాదు చేయడంతో పాటు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభల్లో కూడా సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించి అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు

# విమాన ప్రయాణ అనుభూతి

## హైదరాబాద్‌కు టాలెంట్ స్టూడెంట్స్ పయనం






**రామచంద్రపురం, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ప్రతిభగల పది మంది విద్యార్థిని విద్యార్థులను, ఇద్దరు ఉపాధ్యాయులను రౌండ్ టేబుల్ ఇండియా ఆధ్వర్యంలో విమానంలో హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. విద్యార్థులకు క్షేత్రస్థాయి విజ్ఞానాన్ని అందించడం, వారిలో ఉన్నత ఆశయాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మధురపూడి విమానాశ్రయం వెళ్లే ముందు పాఠశాలలో జరిగిన సమావేశంలో రక్ష ఫౌండేషన్ చైర్మన్ తొగరు మూర్తి మాట్లాడుతూ, విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని మరువకుండా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి, భవిష్యత్తులో తాము చదువుకున్న పాఠశాలకే ముఖ్య అతిథులుగా వెళ్లేలా ప్రయోజకులు కావాలని పిలుపునిచ్చారు. కష్టపడి చదివితే సాధించలేనిది ఏదీ లేదని స్పష్టం చేశారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న ఈ పర్యటన వివరాలను ఆయన వెల్లడించారు. హైదరాబాద్ చేరుకున్న విద్యార్థులకు గోల్కొండ ఫైవ్ స్టార్ హోటల్‌లో వసతి కల్పించామని తెలిపారు. మొదటి రోజు వండర్లా, రామోజీ ఫిల్మ్ సిటీ, సాలార్‌జంగ్ మ్యూజియం సందర్శన ఉంటుందని, రెండవ రోజు నగరంలోని పలు విజ్ఞాన కేంద్రాలను చూపించడంతో పాటు ప్రత్యేక మోటివేషన్ తరగతులు నిర్వహిస్తారని చెప్పారు. మూడు రోజుల ఈ పర్యటన ముగింపులో భాగంగా మూడవ రోజు ఉదయం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో విద్యార్థులను రాజమండ్రికి తీసుకువస్తామని వివరించారు. రౌండ్ టేబుల్ ఇండియా అధ్యక్షుడు అడ్డూరి గౌతమ్ వర్మ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత ఆశయాలతో చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు అవసరమని, ఏ విధమైన మార్గదర్శకత్వం లేదా సహకారం కావాలన్నా అందజేస్తామని భరోసా ఇచ్చారు. తమ పాఠశాల విద్యార్థులను ఈ ప్రత్యేక యాత్రకు ఎంపిక చేసినందుకు రౌండ్ టేబుల్ ఇండియా ప్రతినిధులకు కళాశాల ప్రిన్సిపల్ జవహర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని విక్రయించారని కలెక్టర్‌కు ఫిర్యాదు



**అమలాపురం, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామ పరిధిలోని సీతారామపురంలో ప్రభుత్వ భూమిని ఓ ప్రైవేటు వ్యక్తి విక్రయించాడని ఆరోపిస్తూ అదే గ్రామానికి చెందిన కర్రి చిన్నయ్య ప్రజాఫిర్యాదుల వేదికలో జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఈ విషయంపై ఫిర్యాదు చేయగా, విక్రయించిన భూములు సదరు వ్యక్తికి చెందినవేనని వీఆర్వో ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించేలా నివేదిక ఇచ్చారని ఆయన ఆరోపించారు. తన తండ్రి కర్రి భైరవస్వామికి 1979లో సీతారామపురంలో రెండు ఎకరాల పట్టా భూములు ప్రభుత్వం మంజూరు చేసిందని చిన్నయ్య తెలిపారు. సర్వే నంబర్లు 1072/1-20, 1074/ఏ, 1074/2ఏ1లో 1973 భూసంస్కరణల చట్టం ద్వారా ప్రభుత్వ వశమైన భూముల నుంచి ఈ పట్టాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అయితే తన తండ్రి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అదే గ్రామానికి చెందిన ఓ భూస్వామి ఆ భూములను తన ఆధీనంలో ఉంచుకున్నారని ఆరోపించారు. తన తండ్రికి మంజూరైన భూములను వారసుడిగా తనకు కొలిచి అప్పగించకుండా, అవి నదీ పాతంలో కలిసిపోయినట్లు వీఆర్వో తప్పుడు నివేదిక ఇచ్చారని చిన్నయ్య పేర్కొన్నారు. తప్పుడు నివేదిక ఇచ్చిన వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా సర్వే నంబర్ 1070-2బీలో 3.40 ఎకరాలు, సర్వే నంబర్ 1074-2ఏ-4లో 2.67 ఎకరాల ప్రభుత్వ భూమిని తనదిగా చెప్పుకుంటూ, అందులో 3.40 ఎకరాలను అదే గ్రామానికి చెందిన బొమ్మిడి పల్లయ్యకు, ఎకరన్నర భూమిని అంగాడి సత్యనారాయణకు విక్రయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిలో అనధికారికంగా చెరువులు తవ్వడంతో పాటు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తన తండ్రికి మంజూరు చేసిన రెండు ఎకరాల పట్టా భూమిని వారసుడిగా తనకు కొలిచి అప్పగించాలని, తనది కాని ప్రభుత్వ భూమిని అనధికారికంగా విక్రయించిన వారిపై చర్యలు తీసుకుని ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కర్రి చిన్నయ్య కలెక్టర్‌ను కోరారు.



# తుని నియోజకవర్గంలో దళిత ఆత్మీయ సభ

**అసమానతలు లేని నవ సమాజం నిర్మాణంలో తుని నియోజకవర్గం రాష్ట్రానికి మార్గదర్శకంగా ఉండాలి : మాజీ మంత్రి యనమల**

**దళితుల అభివృద్ధి సాధికారతే లక్ష్యం : ఎమ్మెల్యే యనమల దివ్య**





**కోటనందూరు, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** తుని నియోజకవర్గ దళిత సోదరసోదరీమణులు. రాజకీయాలతో ప్రమేయం లేకుండా దళితులు మధ్య సఖ్యత ఏర్పర్చి ఎస్సీల ఆర్థిక,రాజకీయ,సామాజిక ఎదుగుదలకు మాదిగ, మాలలను ఒకే గొడుగు కిందకు తీసుకుని రావడంలో మాజీ ఆర్థిక మంత్రి తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సఫలీకృతులైయ్యారు. ఒక్కటే మాట..కలిసి ఉంటే కలదు సుఖం..ఓట్ల రాజకీయాలు వేరు సమాజాభివృద్ధి పరితపన వేర్వేరుగా చూడాలని, రాజకీయాలు ఎన్నికలకే పరిమితం కావాలే తప్ప దాని ప్రభావం సమాజంపై ఎంతమాత్రం తగదు,,,ఆలోచన చేద్దాం..మీకు తోడుగా నేను ఉంటాను అన్న యనమల పిలుపునకు కథనోత్సహంతో కదిలి వచ్చిన బహుజనులతో యనమల గార్డెన్స్ పరిసరాలన్నీ నిండిపోయాయి.

**తుని నుంచే తొలి అడుగు మొదలయింది**

యనమల ఏనిర్ణయం తీసుకున్నా అది ప్రజాభీష్టం మేరకే.ప్రజాహితమే ఆయన అభిమతం.40 ఏళ్ళకు పైగా తన రాజకీయ ఎదుగుదలకు సహకరించినట్టే కుమార్తై యనమల దివ్య విజయబాధ్యతలు భుజానేసుకున్న తుని నియోజకవర్గం ప్రజల రుణంతీర్చుకునేందుకు అసమానతలు లేని నవసమాజం నిర్మాణంలో తుని నియోజకవర్గం రాష్ట్రానికే మార్గదర్శకంగా నిలవాలన్న అభిలాషతో నియోజకవర్గ స్థాయిలో యనమల తలపెట్టిన దళిత ఆత్మీయ సభ విజయవంతం అయింది.వర్షాల కారణంగా రెండు దఫాలువాయిదా పడ్డ దళిత ఆత్మీయ సభ ఇవాళ కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట క్యాంప్ కార్యాలయంలో దళిత సోదరుల ఐక్యతారాగం నడుమ విజయవంతమైందనే చెప్పవచ్చు.సుమారు మూడు నుంచి నాలుగు వేల మందితో దళిత ఆత్మీయ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేసారు.అయితే నాలుగింతలకు పైగా దళితులు తరలి వచ్చారు.సభ ప్రారంభ సమయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఉప్పెనలా దళితులు వస్తూనే ఉన్నారు.దాదాపు 15 వేలకు మించి జనం సభకు హాజరయ్యారు

**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబూ జగజ్జీవన్ రామ్,జ్యోతి రావు పూలే లకు పుష్పాంజలి**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్,భారత మాజీ ఉపప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్, సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే చిత్రపటాలకు మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విఫ్ యనమల దివ్య దళిత నేతలతో కలిసి పూలమాలలతో నివాళులర్పించి దళిత ఆత్మీయ సభ ను ప్రారంభించారు.

**కలిసి పయణిద్దాం... అభివృద్ధి పథంలో నడుద్దాం..యనమల**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్,జ్యోతిరావు పూలే వంటి మహనీయులు చూపిన మార్గదర్శకంలో అసమానతలు లేని నవసమాజం నిర్మాణంలో ప్రతి ఒక్కరి ఆలోచనలో ఇమిడి ఉండాలని మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు పిలుపు నిచ్చారు.తేటగుంట క్యాంప్ కార్యాలయంలో జరిగిన దళిత ఆత్మీయ సభలో యనమల మాట్లాడారు . సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు తెలుగు దేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ పేదోళ్ళకు ఆర్థిక వెసులుబాటు కల్పించే లక్ష్యంతో కూడు నీడ బట్ట నినాదంతో సంక్షేమ పథకాలకు అంకురార్పణ చేసారని అన్నివర్గాల సంఘీభావంతో ఉండాలన్న ఉద్దేశంతో ఆనాడే పక్కాఇళ్ళ కాలనీల్లో బీసీ,ఎసీ, ఎస్టీలకు చోటు కల్పించిన విషయాన్ని ఈసందర్భంగా యనమల గుర్తు చేశారు.స్ఫూర్తి ప్రదాతలు అంబేద్కర్, బాబూ జగజ్జీవన్ రామ్, జ్యోతిరావు పూలే వంటి మహనీయుల సమాజమే దేవాలయం,ప్రజలే దేవుళ్ళు గా వారి ఆలోచనలతో అంటరాని తనం వంటి రుగ్మతలను రూపుమాపకలిగామని,అదే స్ఫూహతో అందరూ సఖ్యత,. స్నేహపూర్వకంగా పయనించాలని యనమల పిలుపు నిచ్చారు.దళితులుఅందరూ ఒకే తాటిపై పయనించాలని రెండు వర్గాలుగా చీల్చి చిచ్చురేపే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రజాప్రతినిధులనుప్రశ్నించే హక్కు అందరికీ ఉంటుందని ఇదే సందర్భంలో కలిసి ఉంటే లక్ష్య సాధనలో ముందడుగు వేయగలుగుతామన్నారు . ప్రజానాయకుడు ప్రజల మధ్య ఉండాలని ప్రజా అవసరాలు తీర్చడం బాధ్యత గల ప్రజాప్రతినిధి కర్తవ్యం అన్నారు.ఇది రాజకీయ సభ కాదని ఓట్ల రాజకీయం వేరు సమాజ శ్రేయస్సు వేరని పేర్కొన్న యనమల ఆత్మీయ సభను అంచనాలు మించి విజయవంతం చేసిన దళిత సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు

**దళితుల అభ్యున్నతి సాధికారితే లక్ష్యం..యనమల దివ్య**

సంక్షేమ పథకాలే కాదు దళితుల అభ్యున్నతి సాధికారతే తన ముందున్న లక్ష్యమని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య అన్నారు.దళిత ఆత్మీయ సభ లో దళితులను ఉద్దేశించిప్రసంగించిన యనమల దివ్య ఆర్థిక స్వావలంబన దిశగా దళితులు ముందడుగు వేయాలని సంక్షేమ పథకాలతో పాటు సాధికారితకు పెద్దపీట వేస్తామన్నారు.రాజకీయ ఎదుగుదలతో పాటు ఆర్థిక పురోభివృద్ధి ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తుందని చెప్పారు.తుని నియోజకవర్గంలో అన్ని దళిత వాడల్లో ముందెన్నడూ లేని విధంగా మౌలిక వసతులు కల్పించడం జరిగిందని దాదాపు 8500 ఎస్సీ కుటుంబాలకు ఉచిత విద్యుత్ ను అమలు చేస్తున్నామని ఆమె తెలిపారు ఉద్యోగ ఉపాధికల్పనతో పాటు రాజకీయ ప్రోత్సాహం అందిస్తామన్నారు.

# రెవెన్యూ సేవలలో ప్రజా సంతృప్తినీ పెంచాలి

**ప్రజా ఫిర్యాదులు, రెవెన్యూ సేవలపై అధికారులతో సమగ్ర సమీక్ష : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**



**కాకినాడ, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదలు,సామాన్య ప్రజల పక్షాన నిలిచి రెవెన్యూ సేవలను పారదర్శకంగా, జవాబుదారీ తనంతో, అంకిత భావంతో అందించి ప్రజా సంతృప్తి స్థాయిని పెంచే విధంగా రెవిన్యూ అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్,అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పేనాయక్‌ల తో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, రెవెన్యూ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరి ష్కారం,రెవెన్యూ క్లినిక్‌ల నిర్వహణ,భూ రికార్డుల స్వచ్ఛీకరణ,డిజిటలైజేషన్, రీ-సర్వే ప్రక్రియ,ఆన్‌లైన్, కోర్టు కేసులు పరిష్కారం, రెవెన్యూ సేవల పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు ఉత్తమ పద్ధతులను అవలంబిం చాలని సూచించారు. ఇక పై ప్రతి నెలా క్రమం తప్పకుండా నిర్వహించే రెవెన్యూ సమీక్షా సమా వేశాల్లో సీసీఎల్ఏ కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారులు కూడా పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో రెవెన్యూ సేవల అమలు, ప్రజా సంతృప్తి, నిర్దేశిత లక్ష్యాల సాధనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించా లన్నారు. రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఇంకా మిగిలి ఉన్న 64 గ్రామాల్లో రీ-సర్వే ప్రక్రి యను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వాలి డేషన్, నోటీసుల జారీ తదితర ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. రీ-సర్వే ద్వారా భూము లకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీపై ప్రత్యేక దృష్టి ఈ-కేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, బుక్ ఫర్ ప్రింటింగ్ ప్రక్రియను చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నెల మొదటి వారంలో క్రమం తప్పకుండా పట్టాదారు పాస్ పుస్త కాలను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి, సీసీఎల్ఏ కార్య దర్శులు ప్రతి వారం రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్నం దున, జిల్లాలోనూ నిర్దేశించిన రెవెన్యూ లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని స్పష్టం చేశారు. ప్రజా ఫిర్యాదులకు గడువులోగా నాణ్యమైన పరిష్కారంపిజిఆర్ఎస్ ద్వారా అందే దరఖాస్తులతో పాటు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికార్యాలయాల నుంచి వచ్చే ఫిర్యాదుల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నిర్దేశిత గడువులోగా నాణ్యమైన పరిష్కారం అందించాలని సూచించారు. ప్రధానంగా ఐదు రకాల రెవెన్యూ సేవల ద్వారా సంతృప్తి స్థాయిలని మెరుగుపరచాలన్నారు, ఎఫ్-లైన్ పిటిషన్లు, రీ-సర్వేకు సంబంధించిన వివాదాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రత్తిపాడు మండలంలో అక్టోబర్ 24 తేది న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించ నున్న నేపథ్యంలో గృహ నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ కనీస వసతులు కల్పన ప్రక్రియను వేగ వంతం చేయాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి అవసరమైన స్థలాలను కేటాయించే ప్రక్రియ ను సమన్వయం తో పూర్తిచేయాలనిఆదేశించారు. ప్రజలకు అందించే ప్రతి రెవెన్యూ సేవలో పారదర్శకత, వేగం,జవాబు దారీతనం ఉండేలా అధికారులు పనిచేయాలని, ప్రజల సమస్యలకు సానుకూల దృక్పథంతో పరిష్కారం చూపడం ద్వారా రెవెన్యూ శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశం లో జిల్లా లోని ఆర్డీఓలు,ఎస్ మల్లిబాబు,పి కృష్ణమూర్తి, ఎస్ డి సి శ్రీ రమణి, తహసీల్దార్లు, రెవెన్యూ శాఖ అధికారులు తదిత రులు పాల్గొన్నారు.

# తమ్మవరంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్

**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం, తమ్మవరం గ్రామ పంచాయతీలో లయన్స్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ కాకినాడ మనం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంపు కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్య అతిథిగా పాల్గొని, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించేందుకు ముందుకు వచ్చిన లయన్స్ క్లబ్ నిర్వాహకులను, వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. గ్రామస్తులందరూ ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాదం బాలకృష్ణ , గొల్లపల్లి వెంకట రమణ, గొల్లపల్లి బాబీ, గొల్లపల్లి వీర నాగేశ్వర రావు, గొల్లపల్లి త్రిమూర్తులు, గొల్లపల్లి లోకేష్, గొల్లపల్లి మహేశ్వర రావు, గొల్లపల్లి ఏసుబాబు, గొల్లపల్లి వెంకన్న, గొల్లపల్లి రామ వెంకటేశ్వర్లు, గొల్లపల్లి మెహర్రాజు, వానపల్లి వేంకట రమణ, పెంకే కిషోర్, దాసరి శివ, దెయ్యాల హరిబాబు, లయన్స్ క్లబ్ల కాకినాడ మనం ప్రతినిధులు, వైద్యులు, పంచాయతీ సిబ్బంది, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పంతం నానాజీ**



అన్ని పంచాయతీల్లో

# ‘మన గ్రామం-మన బాధ్యత’ సభలు

**కోటనందూరు, కేఏ మల్లవరం గ్రామాల్లో పాల్గొన్న ఎంపీడీవో వెంకటనారాయణ**



**కోటనందూరు, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామాల సమగ్ర అభి వృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ‘మన గ్రామం-మన బాధ్యత’ కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా కోటనందూరు మండలం లోని అన్ని గ్రామ పంచాయతీల్లో బుధవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉండగా, ఇందులో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు.గ్రామ పంచాయతీ కార్యదర్శులు కన్వీనర్లుగా వ్యవహరించిన ఈ సమావేశాల్లో ప్రత్యేక గ్రామ పంచాయతీ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, పిల్లల బరువుల నమోదు, ఆరోగ్య పరిరక్షణ చర్యలపై అంగన్వాడీ సిబ్బంది వివరించారు.ఏఎన్ఎంలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య సేవలు, ఆశా కార్యకర్తల ద్వారా చేపడుతున్న ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును సభ దృష్టికి తీసుకువచ్చారు.పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇతర మౌలిక వసతులపై వివరాలు వెల్లడించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సేవలను సమర్థవంతంగా అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని సమావేశాల్లో వివరించారు. కోటనందూరు, కేఏ మల్లవరం గ్రామాల్లో నిర్వహించిన ‘మన గ్రామం-మన బాధ్యత’ సభల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. వెంకటనారాయణ పాల్గొన్నారు. గ్రామాల్లో అమలవుతున్న వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను పరిశీలించి, ప్రజలకు అందుతున్న సేవలపై సంబంధిత సిబ్బందితో వివరాలు తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు.

పదవీ విరమణ పొందిన

# ఎస్సై, హెడ్ కానిస్టేబుల్‌ను సత్కరించిన జిల్లా ఎస్పీ





**కాకినాడ, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలీసు శాఖలో సుదీర్ఘకాలం అవిశ్రాంతంగా, అంకితభావంతో విశిష్ట సేవలు అందించి నేడు పదవీ విరమణ పొందిన సామర్లకోట ఎస్సై ఎ. గరగారావు, ట్రాఫిక్-2 హెడ్ కానిస్టేబుల్ వి. శ్రీనివాసరావులను జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల సేవలను కొనియాడుతూ, పోలీసు శాఖకు వారు అందించిన సేవలు, అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం వారి భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డా. మహంతి కిషోర్ కుమార్, డీఎస్పీ (ఏఆర్) వి.జి. శ్రీహరి రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.వి.వి. సత్యనారాయణ మూర్తి, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.సత్యమూర్తి, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే రాయితీల పునరుద్ధరణకు కృషి చేస్తా : ఎమ్మెల్సీ రాజశేఖర్



**కాకినాడ, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత దేశ కాల మాన పరిస్థితులకు అనుగుణంగా వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వాలు వివిధ పథకాలను అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని ముఖ్యంగా రైల్వేలలో సీనియర్ సిటిజన్స్‌కు రాయితీల పునరుద్ధరణకు తన వంతు కృషి చేస్తానని శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్ తెలిపారు. రమణయ్యపేటలో ఎమ్మెల్సీ కార్యాలయంలో కాకినాడ జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు రైల్వే రాయితీలు కోరుతూ ఎమ్మెల్సీ రాజశేఖర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు 40 శాతం, 50 ఏళ్లు పైబడిన మహిళలకు 50 శాతం రైల్వేలలో రాయితీలు ఉండేవని అన్నారు .కరోనా సమయంలో వాటిని కేంద్ర ప్రభుత్వం తొలగించిందన్నారు. ఆ రాయితీలు పునరుద్ధరణకై రాజ్యసభ సభ్యులు, పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకెళ్తానని రాజశేఖర్ హామీనిచ్చారు. ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి అడబాల రత్న ప్రసాద్, సభ్యులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు తదితరులు ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఉన్నారు.

# ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం

**ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ - ధన్యవాదాలు తెలిపిన రైతులు**



**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్నబ్ తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో వరద ముంపు ఏర్పడటంతో పాటు ప్రధాన పంట కాలువలకు గండ్లు పడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముంపు నీరు త్వరితగతిన దిగువకు వెళ్లేలా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటిని బయటకు పంపేందుకు తక్షణ చర్యలు చేపట్టారు. పండూరు నీటి కాలువ అధ్యక్షుడు నాగిశెట్టి అమ్మిరాజు ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా గండ్లు పడిన కాలువలను పూడ్చే పనులు చేపట్టి, నీరు దిగువ ప్రాంతాలకు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇరిగేషన్ అధికారులు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. అలాగే పండూరు జనసేన నాయకులు, నీటి కాలువ అధ్యక్షుడి ఆధ్వర్యంలో కాలువలకు పడిన గండ్లను పూడ్చడంతో పాటు ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వరద నీటిని త్వరగా బయటకు పంపించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. భవిష్యత్‌లో ఇలాంటి ముంపు పరిస్థితులు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ముంపు ఏర్పడిన ప్రాంతాల్లో అవసరమైన చోట వంతెనల నిర్మాణం, ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన మట్టి, పూడిక తొలగింపు, కాలువల సామర్థ్యాన్ని పెంచే పనులను త్వరితగతిన చేపట్టాలని అధికారులను కోరారు. శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే మరియు రెవెన్యూ, ఇరిగేషన్ మండల అధికారులు అందరికీ ధన్యవాదాలు తెలిపిన రైతులు.



# ఎన్నికల కమిషన్‌పై సమగ్ర దర్యాప్తు జరపాలి

## జ్ఞానేశ్వర్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి: కాంగ్రెస్ నేతల డిమాండ్



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం: ఎన్నికల కమిషన్ పనితీరు, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరపాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్రపతిని ఉద్దేశించి సబ్ కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించారు. ధర్నా అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్లమెంటరీ కోఆర్డినేటర్ టీ.కే. విశ్వేశ్వర్ రెడ్డి, రాజమండ్రి అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్, ఏపీ కిసాన్ కాంగ్రెస్ సెల్ చైర్మన్ కామాని ప్రభాకర్ రావు, రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు ఆకుల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌పై వచ్చిన ఆరోపణలన్నింటిపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఓటర్ల జాబితాల సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా వారి ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేశారు. SIR ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయన్న అంశంపై పూర్తిస్థాయి పరిశీలన అవసరమని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియ, ఎన్నికల సంఘం స్వతంత్రతపై కూడా కాంగ్రెస్ నాయకులు ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల సంఘం ఏ రాజకీయ ప్రభావానికీ లోనుకాకుండా స్వతంత్రంగా, పారదర్శకంగా పనిచేసేలా వ్యవస్థలో తగిన మార్పులు తీసుకురావాలని కోరారు. ఎన్నికల సంఘంలోని సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు, నిర్ణయాలపై వచ్చిన వార్తలను కూడా పరిగణనలోకి తీసుకుని వాస్తవాలను ప్రజల ముందుంచాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని దర్యాప్తు సంస్థలు, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థల పనితీరుపై కూడా కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, ఓటు హక్కును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగించినట్లయితే, అర్హత ఉన్న ప్రతి ఓటరుకు తిరిగి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఓటు హక్కు పరిరక్షణ కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నాయకులు తెలిపారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన ధర్నా, ర్యాలీలో పీసీసీ ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, కొవ్వూరు టౌన్ ప్రెసిడెంట్ బచ్చు బుజ్జిబాబు, జిల్లా డాక్టర్ సెల్ చైర్మన్ రాజశేఖర్, రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి సింధియా రాణి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోత శారద, అర్బన్ బీసీ సెల్ చైర్మన్ తాడి సూరిబాబు, అనపర్తి ఇన్‌చార్జి గుండ్రపు ఏసు, బిక్కవోలు మండల ఇన్‌చార్జి కొల్లి చిన్న, నిడదవోలు కోఆర్డినేటర్ ఎం. భద్రం దొర, బర్రె సుబ్రహ్మణ్యం, ఎం.డి. ఆలీ, మురళీకృష్ణ, యాళ్ల వీరభద్రరావు, లలిత, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు.

నియోజకవర్గంలో 30కోట్ల నిధులతో

# పలురోడ్లకు మహర్దశ : బత్తుల

**269 కోట్లతో సీతానగరం, కోరుకొండ మండలాలకు త్రాగునీరు**

**నియోజకవర్గానికి జోరుగా రుడా నిధులు**



**కోరుకొండ, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజక వర్గానికి 30కోట్ల రూపాయల నిధులతో రోడ్డును అభివృద్ధి చేయడానికి జోరుగా శంకుస్థాపన చేస్తున్నట్లు రాజానగరం శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని మూడు మండలాలకు సంబంధించిన సుమారు 30కోట్లతో పలు గ్రామాల్లో శాసనసభ్యులు బత్తుల, జిల్లా అధ్యక్షులు వెంకటరమణ చౌదరి చేతుల మీదుగా జోరుగా శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని, వాటన్నిటిని సరి చేయడానికి ఎన్డీఏ ప్రభుత్వానికి కత్తి మీద సాముల ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్ ఆశీస్సులతో రాజానగరం నియోజక వర్గానికి త్రాగునీరు, సాగునీరు, విద్య,వైద్యం, రోడ్లు, అభివృద్ధి సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు ఇస్తున్నారని, ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. సీతానగరం, కోరుకొండ మండలకు సంబంధించి 269 కోట్లతో ప్రతి ఇంటికి గోదావరి జలాలు అందిస్తామ న్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో వచ్చే ఏడాదికి పోలవరం పూర్తి చేసి, ఆంధ్రుల చిరకాల స్వప్నాన్ని నెరవేరుస్తామన్నారు. అమరావతిలో కూడా అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయన్నారు. గత వైసిపి ప్రభుత్వం నిరుపేదకు తప్పుడు పట్టాలను అందించి స్థలాలు చూపించలేదని, ఆ సమస్య ప్రభుత్వానికి గుదిబండగా మారిందన్నారు. అర్హులైన సుమారు 13లక్షల మందికి పింఛన్లు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాజానగరం నియోజకవర్గంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్, భూకబ్జాలు లేకుండా ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. రుడా చైర్మన్ బొడ్డు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రుడా నిధులను విరివిగా అందించమన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులు, తెదేపా జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి, అడ్డాల శ్రీను, కంటే నాగ కేశవరావు, గంగిశెట్టి చంటిబాబు, వేగిశెట్టి రాజు, చిట్టిప్రోలు సత్తిబాబు, కిమిడి శ్రీరామ్, కొత్తపల్లి రఘు, వడ్డీ చిన్న, మద్దాల ఏసుపాదం ముక్క రాంబాబు, యర్రంశెట్టి పోలారావు, అడపా శ్రీనివాస్, తిరుమలనాధుని వెంకన్నబాబు, కందుల బాబురాయుడు, తన్నీరు తాతాజీ, జన సైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం నిర్వాసితులకు పూర్తి పునరావాసం కల్పించాలి

## ఆంధ్రప్రదేశ్లో గిరిజనులకు రక్షణ కల్పించాలి - బకులూరులో అక్రమ మైనింగ్ నిలుపుదల చేయాలి

## ఆదివాసీ మహాసభ డిమాండ్

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయిలో పునరావాసం, పునరావాస విధానం ప్రకారం పరిహారం అందించిన తర్వాతే తరలించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గతంలో ఆదేశించినట్లు ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ పేర్కొన్నారు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా పునరావాసం కల్పించకుండా బలవంతంగా ఖాళీ చేయించడానికి వీలులేదని హైకోర్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొందని వివరించారు. ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ W.P. Nos. 17368, 17705, 18020, 19067, 19717, 27095 కేసుల్లో 2007 జూన్ 20న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురయ్యే 276 గ్రామాలు, అలాగే ప్రాజెక్టు అమలుతో ప్రభావితమయ్యే షెడ్యూల్డ్ ఏరియాల్లోని ప్రజలను పునరావాస విధానాన్ని పూర్తిగా అమలు చేయకుండా తరలించరాదని ఆదేశించినట్లు పేర్కొన్నారు. డ్యామ్‌లో నీటిని నిల్వ చేసి గ్రామాలు ముంపునకు గురయ్యే ముందు, ప్రభావిత కుటుంబాలకు పునరావాసం, పునరావాస స్థాపనతో పాటు విధానం ప్రకారం పరిహారం చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. 2022లో రాజ్యసభలో జరిగిన చర్చిలో జల శక్తి మంత్రి బిశ్వేశ్వర్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద 10 లక్షలు ఇస్తున్నట్టు ప్రకటించినా అదెక్కడ అమలు కావడం లేదని విమర్శించారు. కొత్త భూసేకరణ చట్టం, పీసా చట్టం ఏజెన్సీ ప్రాంతాల్లో అమలు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

**రంగు రాళ్ళు కుంభకోణంపై సి.బి.ఐ. విచారణ జరపాలి..**

అల్లూరి సీతారామరాజు జిల్లా, కొయ్యూరు మండలం, బకులూరు గ్రామంలో ఆదివాసీలకు అటవీ హక్కుల చట్టం ప్రకారం భూములకు పట్టాలు ఇచ్చారని, ఈ భూములలో గిరిజనేతరులు మైనింగ్ జరిపి గత 6 నెలలుగా కోట్లాది రూపాయిల రంగు రాళ్ళు తీసుకుని పోయారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు ఈ చట్ట



విరుద్ధ కార్యక్రమాలకు మద్దతు ఇచ్చి గిరిజనులపై కొయ్యూరు పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు చేసారు. దీనిపై ప్రభుత్వం సి.బి.ఐ. విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

**5వ షెడ్యూళ్ళులో కలపాలి :**

కాకినాడ జిల్లాలో రంపచోడవరం ఐ.టి.డి.ఎ. సబ్ ప్లాను గిరిజన గ్రామాలకు 5వ షెడ్యూలు ఫలాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. ఈ గ్రామాలు శంఖవరం, ప్రత్తిపాడు, రౌతులపూడి మండలాలలో ఉన్నాయన్నారు. హైకోర్టు ఆదేశాలను అధికారులు పాటించి గిరిజనులకు రక్షణ కల్పించాలని సూర్యనారాయణ కోరారు. ఏపీ ఆదివాసి జేఏసీ తరఫున తెల్లం శేఖర్, బకులూరు మాజీ సర్పంచ్ చిన్నయ్య మాట్లాడారు. సమావేశంలో లోచల రమేష్, లోచల గంగాభవాని, లోచల చిన్నబ్బాయి, కొలువు దేవుడు, వేట్ల చిన్నబాబు, కూడ చిన్నయ్య, మేసరి నాగరాజు, కోపురు పద్మ, పూనం విష్ణు, అన్నిక బావనమ్మ, కోనపర్తి అర్జున్, జీడం నాగేశ్వరరావు, గంప నాగేశ్వరరావు, ఎలగాడ నాగేశ్వరరావు, కారం రామన్న దొర, సిహెచ్ వెంకటరత్నం, గంటి బుజ్జి, తాళ్లూరి భవాని, కొండే ఊహ, జక్కల పాండవులు తదితరులు పాల్గొన్నారు.

# 12.95 కోట్లతో దోసకాయలపల్లి సొసైటీ కార్యకలాపాలు : సూదిన

**కొత్త భవనానికి నిధులు ఇవ్వండి**




**కోరుకొండ, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని దోసకాయలపల్లి సొసైటీ సుమారు 12.95 కోట్లతో వ్యాపార కార్యకలాపాలు సాగిస్తుందని త్రిసభ్య కమిటీ అధ్యక్షులు సూదిన గంగాధర్ అన్నారు. బుధవారం సీఈవో కోయిడాల శివ అప్పలరాజు ఆధ్వర్యంలో రైతులతో సర్వజన మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సూదిన గంగాధర్ మాట్లాడుతూ సొసైటీలో ఈ ఆర్థిక సంవత్సరానికి సుమారు 28లక్షల రూపాయలు “రైతు నేస్తం” ద్వారా రైతులకు కొత్త రుణాలు ఇచ్చామన్నారు. ఈ ఏడాది ఎరువుల ద్వారా 42వేలు లాభాన్ని ఆర్జించామన్నారు. రైతుల నుండి 98% రుణాలు వసూలు చేయడంతో పాటు మూడు లక్షల రూపాయలు పాత బకాయిలు రాబట్టమన్నారు. అనంతరం సీఈవో రైతులకు సొసైటీ కార్యకలాపాలను వివరించారు. సొసైటీ కార్యకలాపాలను విస్తృతం చేయడానికి నూతన భవనానికి స్థలము, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని త్రిసభ్య కమిటీసభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు కర్రి రాజారావు, మార్ని రాము, మార్ని బుజ్జి, సొసైటీ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

పారాక్వాట్ (గడ్డిమందు) నిషేధం అభినందనీయం

కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి

# బీజేపీ కిసాన్ మోర్చా ధన్యవాదాలు

**జిల్లా అధ్యక్షులు చింతా తమ్మిరెడ్డి**




**రాయవరం, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా ఆరోగ్యం, రైతుల సంక్షేమం, పశుసంపద రక్షణను దృష్టి లో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు చింతా తమ్మిరెడ్డి పేర్కొన్నారు. ప్రమాదకరమైన విషపూరిత గడ్డి మందు ‘పారాక్వాట్’పై దేశవ్యాప్తంగా నిషేధం విధిస్తూ కేంద్ర వ్యవసాయ శాఖ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. ఈ సందర్భంగా చింతా తమ్మిరెడ్డి మాట్లాడుతూ పారాక్వాట్ మందు వినియోగం కారణంగా మనుషుల ప్రాణాలతో పాటు పశువులకు కూడా తీవ్ర నష్టం వాటిల్లిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకోవడం రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో ఇప్పటికే పారాక్వాట్‌పై ఆంక్షలు, నిషేధాలు అమల్లో ఉన్నాయని పేర్కొన్న ఆయన, భారత్‌లోనూ దీని వినియోగాన్ని నియంత్రించే నిర్ణయం తీసుకోవడం ద్వారా ప్రజల ఆరోగ్యం, రైతుల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఇన్సెక్టిసైడ్ యాక్ట్‌లోని సెక్షన్-9 కింద పారాక్వాట్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను రద్దు చేయడం, తయారీ, దిగుమతి, రవాణా, పంపిణీ, విక్రయాలపై నిషేధం విధించడం ద్వారా ప్రమాదకర రసాయనాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రైతుల ప్రాణాలను, పశుసంపదను కాపాడే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని బీజేపీ కిసాన్ మోర్చా తరఫున పూర్తిగా స్వాగతిస్తున్నామని, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర వ్యవసాయ శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చింతా తమ్మిరెడ్డి తెలిపారు.

# దేవిచౌక్ దుర్గమ్మ అమ్మవారి సేవకు కంబాల సైన్యం సిద్ధం



**గోకవరం, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా, జగ్గంపేట నియోజకవర్గం గోకవరం గ్రామంలోని దేవిచౌక్ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దసరా మహోత్సవాలు సందర్భంగా అమ్మవారి సేవకు కంబాల సైన్యం సిద్ధమైంది. దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి సన్నిధిలో సేవ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ, గోకవరం పంచాయతీ పరిధిలోని పలు కాలనీ, వీధిలకు చెందిన యువత, ప్రజలు బుధవారం రాత్రి సీఎండీ లే అవుట్ లోని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు గారి వద్దకు వచ్చి విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కంబాల శ్రీనివాసరావు గారు దసరా మహోత్సవాల తొలిరోజు నుంచి ఉత్సవాలు ముగిసే చివరి రోజు వరకు తన అభిమానులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో దేవిచౌక్ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో ఉండి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సహకరించడం, ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములవడం, అవసరమైన సేవలు అందించడం వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, కంబాల శ్రీనివాసరావు గారు పిలుపునిచ్చారు.కంబాల శ్రీనివాసరావు గారి ఆదేశాల మేరకు గోకవరం పంచాయతీ పరిధిలోని వివిధ కాలనీ, వీధిలకు చెందిన యువత, అభిమానులు, ప్రజలు అమ్మవారి సేవకు సిద్ధమయ్యారు. నేటి నుంచి దసరా మహోత్సవాలు పూర్తయ్యే వరకు ఉదయం నుంచి రాత్రి వరకు దేవిచౌక్ అమ్మవారి సన్నిధిలో సేవలందించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అమ్మవారి సేవలో భాగస్వామ్యం కావడం తమకు లభించిన అదృష్టంగా భావిస్తున్నామని, భక్తి, సేవా భావంతో దసరా మహోత్సవాలను విజయవంతం చేసేందుకు కంబాల సైన్యం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరసాల ప్రసాద్, డ్రైవర్స్ కాలనీ చెందిన దోసపాటి చిన్న సుబ్బారావు, తమాతపు కన్నబాబు, తాటికొండ సురేష్, దోసపాటి సూరిబాబు, సంజీవనగర్ చెందిన కందికట్ల మూర్తి, వీరసుర్ల కార్తికేయ, నేతల నిఖిల్, బాతు ఆనంద్, న్యూ అంబేద్కర్ కాలనీ చెందిన మందపాటి సతీష్, బేదంపూడి కిషోర్, వజ్రంగి మురళి, కొల్లపు చందు, సురేష్, బరకటి రాజు ( కేబుల్ రాజు) పాలెపు వారి తోటకి చెందిన నల్ల సూరిబాబు, కొప్పిశెట్టి సత్యనారాయణ, చలాది సుభాష్, రవీంద్ర నగర్ కి చెందిన బొమ్మిరెడ్డి తారక రామారావు, అద్దంకి లోకేష్, అలవల రాజు, అచ్చయ్యపేటకి చెందిన మంగరాతి పద్దరాజు, తుమ్మల బుజ్జి, అంబటి శ్రీను, కాంప్లెక్స్ సెంటర్ కి చెందిన మహిపాల దుర్గారావు, మహిపాల జయరాజ్, మహిపాల పెద్ద వీరబాబు, నరాలశెట్టి వెంకన్న, శిలం శేషగిరి రేవడా వారి వీధికి చెందిన చిలుకు బాబీ, చిలుకు రాజేంద్ర, పాత బస్టాండ్ కి చెందిన పదిలం చక్రరావు, నిడదవోలు వీరబాబు, పూల శేఖర్, తో పాటు పలువురు పాల్గొన్నారు.

గాదరాడలో ఘనంగా స్వర్గీయ

# అనంతలక్ష్మి వర్ధంతి వేడుకలు

**మహిళలకు చీరలు పంపిణీ**



**కోరుకొండ, సెప్టెంబర్ 30, విశ్వం వాయిస్ న్యూస్ :** గాదరాడ వైయస్సార్సీపి సీనియర్ నాయకులు తోరాటి శ్రీనివాస్ మాతృమూర్తి స్వర్గీయ అనంతలక్ష్మి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.బుధవారం గాదరాడలో తోరాటి ఆధ్వర్యంలో స్వర్గీయ అనంతలక్ష్మి వర్ధంతిని పురస్కరించుకొని అనంతలక్ష్మి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా తోరాటి మాట్లాడుతూ 1990వ సంవత్సరంలో శ్రీ కనకదుర్గ అమ్మవారు తన మాతృమూర్తికి స్వప్నంలో కనిపించి, గాదరాడ ఊరు శివారులో ఉన్న వేపచెట్టు దగ్గర తనకి గుడి కట్టించమని చెప్పింద న్నారు.అప్పటి నుండి అనంతలక్ష్మిపై అమ్మవారు రావడం, గ్రామస్తులు భక్తుల సహాయ సహకారంతో 1993వ సంవత్సరంలో కనకదుర్గ అమ్మవారి గుడి నిర్మాణం జరిగిందన్నారు. గ్రామస్తులు, గ్రామపెద్దల సహాయ సహకారాలతో “శ్రీ కనకదుర్గ అమ్మ”వారి జాతర వైభవంగా జరిపించేవా రన్నారు. దుర్గమ్మ ఆశీస్సులతో పాటు తన మాతృమూర్తి అనంతలక్ష్మి ఆశీస్సులు తమకు, మా గ్రామప్రజలకు ఎల్లప్పుడు ఉండాలన్నారు. అనంతరం మహిళలకు తన మాతృమూర్తి జ్ఞాపకార్థం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తోరాటి కుటుంబసభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
✦ సువర్ణావకాశం ✦
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

### 'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్' సినిమాలో నటించిన

# ఈ పాప ఎవరో తెలుసా?




మలయాళం స్టార్ హీరో ఫహద్ ఫాజిల్ నటిస్తోన్న లేటెస్ట్ సినిమా డోంట్ ట్రబుల్ ది ట్రబుల్. దర్శక ధీరుడు రాజమౌళి కుమారుడు కార్తికేయ ఈ సినిమాను నిర్మించడంతో ఈ మూవీపై భారీ అంచనాలున్నాయి. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ శుక్రవారం (అక్టోబర్ 02) ప్రేక్షకుల ముందుకు రానుంది. మలయాళం నటుడు ఫహాద్ ఫాజిల్ హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ సినిమా డోంట్ ట్రబుల్ ది ట్రబుల్. ఆర్కా మీడియా వర్క్స్, షోవింగ్ బిజినెస్ బ్యానర్స్ పై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్ ఎస్ కార్తికేయ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించారు. అలాగే దర్శక ధీరుడు రాజమౌళి ఈ సినిమాకు సమర్పకుడిగా వ్యవహరిస్తుండడంతో ఈ మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి అడ్వెంచర్ ఫాంటసీ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన ఈ సినిమాకు శశాంక్ యేలేటి దర్శకత్వం వహించారు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ శుక్రవారం (అక్టోబర్ 02)న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ సినిమాలో సారా పాలేకర్ అనే చైల్డ్ ఆర్టిస్ట్ ఓ కీలక పాత్ర చేసింది. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి రిలీజైన గ్లింప్స్, ట్రైలర్ కంటెంట్ లో ఫహాద్ ఫాజిల్ తో పాటు ఈ పాపనే ఎక్కువగా కనిపించింది. ఈ మూవీ మొత్తం దాదాపు వీరిద్దరి చుట్టూనే తిరుగుతుందని తెలుస్తోంది. ఇక మంగళవారం (సెప్టెంబర్ 29) జరిగిన ఈ సినిమా ప్రి రిలీజ్ ఈవెంట్లోనూ సారా నే స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ప్రస్తుతం ఈ చైల్డ్ ఆర్టిస్ట్ కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట తెగ వైరలవుతున్నాయి. నెటిజన్లు కూడా ఈ చిన్నారి ఎవరో, తన బ్యాక్ గ్రౌండ్ ఏంటో తెలుసుకునేందుకు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ క్యూటీ గురించి కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2017లో పుట్టిన సారా పాలేకర్.. నాలుగేళ్లకే అంటే 2021లో నటించడం మొదలుపెట్టింది. మరాఠీలో కొన్ని సీరియల్స్, టీవీ షోల్లో చేసింది సారా. అలాగే కొన్ని ఆల్బమ్ సాంగ్స్ కూడా చేసింది. ఇక ప్రస్తుతం సినిమాల్లో బాలనటిగా రాణిస్తోంది సారా. గతంలో విక్టరీ వెంకటేష్ నటించిన సైంధవ్ సినిమాలోనూ సారా పాలేకర్ వెంకీ కూతురిగా నటించింది. ఇప్పుడు మళ్లీ డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ సినిమాతో తెలుగు ఆడియెన్స్ ను పలకరించేందుకు రెడీ అయ్యిందీ క్యూటీ. సినిమాలో ఫహాద్ ఫాజిల్ తర్వాత సారా పాలేకర్ యాక్టింగే స్పెషల్ ఎట్రాక్షన్ గా ఉండబోతుందని సినిమా నిపుణులు చెబుతున్నారు. ఈ శుక్రవారమే ఈ సినిమా థియేటర్లలోకి రానుంది.

# ఐశ్వర్య రాయ్‌ను కూడా అలా అనేశారేంట్రా..!

### ప్రపంచ సుందరికి తప్పని బాడీ షేమింగ్

ఐశ్వర్య రాయ్ కర్ణాటకలోని మంగుళూరులో జన్మించింది. ఆ తర్వాత మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టడానికి ముంబైకి వెళ్లి అక్కడే స్థిరపడింది. 1994లో ఆమె మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకొని ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 1997లో ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన ఇరువర్ సినిమాతో సిల్వర్ స్క్రీన్ కు పరిచయమైంది. ఆ తర్వాత బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి వరుస విజయాలను అందుకుంది. ప్రపంచ సుందరిగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న అందాల తార ఐశ్వర్య రాయ్ బచ్చన్. తాజాగా ఈ ముద్దుగుమ్మ మరోసారి అంతర్జాతీయ వేదికపై తన ప్రత్యేకతను చాటుకున్నారు. పారిస్ ఫ్యాషన్ వీక్‌లో జరిగిన ఓ ప్రతిష్టాత్మక ఫ్యాషన్ షోలో ర్యాంప్‌పై సందడి చేసిన ఆమె.. తన స్టైల్, గ్రేస్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. ర్యాంప్ వాక్ పూర్తయిన తర్వాత అభిమానులను ఉద్దేశించి ఆమె ఇచ్చిన ఫ్లయింగ్ కిస్, హార్ట్ సింబల్ కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే ఐశ్వర్య రాయ్‌కి సంబంధించిన వీడియోలు, ఫొటోలు నెట్టింట వైరల్ గా మారాయి. ఈ క్రమంలోనే కొందరు నెటిజన్లు ఆమె లుక్‌ను కాకుండా.. శరీరాకృతిపై పిచ్చి పిచ్చి కామెంట్స్ చేయడం, బాడీ షేమింగ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. లోరియల్ పారిస్ నిర్వహించిన 'ఎక్స్‌ప్రెస్ యువర్ వర్త్' ఫ్యాషన్ షోలో ఐశ్వర్య రాయ్ బచ్చన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వయోలా డేవిస్, క్రిస్టెన్ బెల్, సిమోన్ అష్లే, ఈవా లాంగోరియా, కెండల్ జెన్నర్ తదితర అంతర్జాతీయ ప్రముఖులు కూడా సందడి చేశారు. కాగా ఐశ్వర్య ధరించిన లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్టైలిస్ట్ మోహిత్ రాయ్ ఆమె లుక్‌ను డిజైన్ చేశారు. ర్యాంప్‌పై నడుస్తూ ఐశ్వర్య ప్రదర్శించిన కాన్ఫిడెన్స్, ఎక్స్‌ప్రెషన్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ర్యాంప్ వాక్ తర్వాత ఐశ్వర్య చేసిన ఫ్లయింగ్ కిస్, హార్ట్ సింబల్ కు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. కాగా ఐశ్వర్య రాయ్ ఫ్యాషన్ షోకు సంబంధించిన పోస్టుల కింద కొంతమంది నెటిజన్లు ఆమె బాడీని టార్గెట్ చేస్తూ కామెంట్లు చేశారు. ఆమె బరువుపై పిచ్చిపిచ్చి కామెంట్స్, గతంలో లుక్ తో పోల్చుతూ విమర్శలు చేశారు. కొందరు ఆమె లుక్‌పై అసభ్యకరమైన కామెంట్స్ చేస్తుండగా.. మరికొందరు ఆమె గర్భధారణకు సంబంధించిన ప్రశ్నలను కామెంట్స్ చేశారు. ఇంకొందరు ఆమె



బరువు తగ్గాలని సూచిస్తూ కూడా కామెంట్లు పెట్టారు. ఒకవైపు ట్రోలింగ్ జరుగుతుండగా.. మరోవైపు ఐశ్వర్య రాయ్ అభిమానులు మాత్రం ఆమెకు గట్టిగా మద్దతు తెలిపారు. సోషల్ మీడియా పోస్టుల కింద ఆమెను ప్రశంసిస్తూ వేలాది కామెంట్లు కనిపించాయి. ఎప్పటికీ రాణే, క్వీన్ ఐశ్వర్య, మా రాణి ఎప్పుడూ గెలుస్తుంది అంటూ అభిమానులు ఐశ్వర్యపై తమ ప్రేమను వ్యక్తం చేశారు.

# గౌహతి వన్డేలో భారత్ ఘన విజయం.. సిరీస్ కైవసం

గౌహతిలోని బర్సపార క్రికెట్ స్టేడియం వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో భారత జట్టు ఘన విజయం సాధించింది. వెస్టిండీస్‌పై బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా, పర్యాటక జట్టుపై అలవోకగా నెగ్గి మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. గౌహతిలోని బర్సపార క్రికెట్ స్టేడియం వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో భారత జట్టు ఘన విజయం సాధించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా, పర్యాటక జట్టుపై అలవోకగా నెగ్గి మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. 405 పరుగుల భారీ లక్ష్య చేధనతో బరిలోకి దిగిన భారత్ లక్ష్యాన్ని ఈజీగా చేధించింది. తొలుత ఓపెనర్లు వచ్చిన శుభమిన్ గిల్ డబుల్ సెంచరీ, రోహిత్ శర్మ అద్భుత సెంచరీతో మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోశించారు. తొలుత టాస్ గెలిచి భారత్ ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 405 పరుగుల భారీ స్కోర్ చేసింది. వెస్టిండీస్ బ్యాటర్లలో



జాన్ చంప్‌బెల్ 68 బంతుల్లో 101 పరుగులు చేయగా, షాయ్ హోప్ 94 బంతుల్లో 104 పరుగులు, అమీర్ జంగూ 77 బంతుల్లో 114 పరుగులు చేసి భారత్ బౌలర్లపై విరుచుకు పడ్డారు. ఇక మొత్తం 50 ఓవర్లలో వెస్టిండీస్ జట్టు భారత్ ముందు 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఇక భారీ లక్ష్య చేధనలో బరిలోకి దిగిన భారత్ బ్యాటర్లు సైతం అదే ఊపుతో వెస్టిండీస్ బౌలర్లను ఉతికారేశారు. తొలుత ఓపెనర్లు వచ్చిన శుభమన్ గిల్ డబుల్ సెంచరీ(133 బంతుల్లో 223)తో అదరగొట్టగా.. 75 బంతుల్లో 101 పరుగులు చేసిన భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇక తర్వాత వచ్చిన కోహ్లీ 19 బంతుల్లో 29, గౌక్వాడ్ 37 బంతుల్లో 31 పరుగులు చేయడంతో 6 ఓవర్ల 3 బంతులు ఉండగానే భారత్ విజయలక్ష్యాన్ని చేధించింది. అయితే ఈ ఇది మొత్తం మూడు వన్డేల సిరీస్ కావడంతో.. తొలి వన్డేలోనూ భారత్ వెస్టిండీస్‌పై విజయం సాధించింది. తాజాగా రెండో వన్డేలోనూ భారత్ ఘన విజయం సాధించడంతో.. మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-0తో కైవసం చేసుకుంది.

# ఏషియన్ గేమ్స్‌లో భారత్‌కు గోల్డెన్ డే.. ఒక్క రోజే 4 స్వర్ణాలు..!




ఆసియా క్రీడలు 2026లో భారత్‌కు బుధవారం స్వర్ణోత్సవంగా మారింది. ఒకే రోజు నాలుగు బంగారు పతకాలు ఖాతాలో చేరగా, మొత్తం స్వర్ణాల సంఖ్య 10కి చేరింది. ఆర్చరీలో పురుషుల కాంపౌండ్ టీమ్ చైనాను 238-237తో ఓడించి మరో గోల్డ్ అందించింది. దీంతో భారత్ పతకాల పట్టికలో ఏడో స్థానంలో ఉంది. ఆసియా క్రీడలు 2026లో భారత్‌కు బుధవారం ప్రత్యేకమైన రోజుగా నిలిచింది. భారత క్రీడాకారులు ఒకే రోజులో నాలుగు స్వర్ణ పతకాలు సాధించడంతో దేశ ఖాతాలో గోల్డ్ మెడల్స్ సంఖ్య 10కి చేరింది. ఆర్చరీలో కుశాల్ దలాల్, సాహిల్ జాదవ్, గణేశ్ మణి రత్నం తిరుమూరుతో కూడిన భారత పురుషుల కాంపౌండ్ టీమ్ చైనాపై 238-237 తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని అందుకుంది. తొలుత వెనుకబడిన భారత బృందం కీలక దశలో పుంజుకుని ఒక్క పాయింట్ ఆధిక్యంతో ఫైనల్ ముగించింది. ఈ విజయంతో ఆర్చరీలో భారత్ మరోసారి తన పతకాల సంఖ్యను పెంచుకుంది. మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో చికితా తణిపర్తి, పృథికా ప్రదీప్, జ్యోతి సురేఖ వెన్నం స్వర్ణం సాధించారు. మహిళల టీమ్ ఈవెంట్‌లో ప్రపంచ రికార్డును సమం చేసిన తరువాత చికితా మరో గోల్డ్ సాధించే అవకాశం అందుకుంది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సాహిల్ జాదవ్‌తో కలిసి ఆమె బంగారు పతకం గెలిచింది. షూటింగ్‌లోనూ భారత్‌కు మరో స్వర్ణం లభించింది. ట్రాప్ మిక్స్‌డ్ టీమ్‌లో కైనన్ చెనై, నీరూ ధాండా జోడీ అద్భుత ప్రదర్శన చేసింది. ఈ జోడీ ఆసియా క్రీడల రికార్డును బద్దలు కొట్టి భారత్ ఖాతాలో తొమ్మిదో స్వర్ణాన్ని చేర్చింది. ఆ తరువాత పురుషుల కాంపౌండ్ టీమ్ విజయం సాధించడంతో గోల్డ్ మెడల్స్ సంఖ్య 10కి చేరింది. బాక్సింగ్‌లో భారత్‌కు రెండు కాంస్య పతకాలు లభించాయి. మహిళల 60 కేజీల విభాగంలో ప్రియా ఘంఘాస్ 1-4 పాయింట్ల తేడాతో ఓడి కాంస్యంతో సరిపెట్టుకుంది. పురుషుల 90 కేజీల విభాగంలో కపిల్ పోఖరియా సెమీఫైనల్లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ తురాబెక్ ఖబిబుల్లాయెవ్ చేతిలో 1-4 తేడాతో ఓడాడు. దీంతో అతడికి కూడా కాంస్య పతకం దక్కింది. ప్రస్తుతం భారత్ 59 పతకాలతో పట్టికలో ఏడో స్థానంలో ఉంది. ఇందులో 10 స్వర్ణాలు, 21 రజతాలు, 28 కాంస్యాలు ఉన్నాయి. చైనా 145 స్వర్ణాలతో అగ్రస్థానంలో ఉండగా, జపాన్ 45 గోల్డ్స్‌తో రెండో స్థానంలో ఉంది. కొరియా రిపబ్లిక్ 24 స్వర్ణాలతో మూడో స్థానంలో కొనసాగుతోంది. భారత్ ఖాతాలో చేరిన నాలుగు గోల్డ్ మెడల్స్ బుధవారం పోటీలకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచాయి.

# గౌహతీ వన్డేలో అదరగొట్టిన రోహిత్..

### సెంచరీతో చెలరేగిన హిట్‌మ్యాన్!



గౌహతి వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో వన్డే మ్యాచ్‌లో భారత ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్నారు. 405 పరుగుల లక్ష్య చేధనలో బరిలోకి దిగిన భారత్ ఓపెనర్స్.. వెస్టిండ్ బౌలర్లను ఉతికారేశారు. ఓపెన్లరు వచ్చిన గిల్, రోహిత్ శర్మలు సెంచరీలతో అదరగోట్టారు. గౌహతి వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో వన్డే మ్యాచ్‌లో భారత ఆటగాళ్లు అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్నారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఏకంగా 405 పరుగులు సాధించి, భారత్ ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం 406 పరుగుల భారీ లక్ష్య చేధనతో బరిలోకి దిగిన టీమిండియా సైతం అదే స్థాయిలో ఎదురుదాడి ప్రారంభించింది. భారత ఓపెనర్లు వెస్టిండీస్ బౌలర్లపై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శిస్తూ విరుచుకుపడ్డారు. ఓపెనర్లుగా క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ సూపర్ సెంచరీలతో చెలరేగి ఆడటంతో భారత్ పటిష్ట స్థితిలో కొనసాగుతోంది. రోహిత్ శర్మ 73 బంతుల్లో 100 పరుగులు చేయగా.. ప్రస్తుతం శుభమన్ గిల్ 84 బంతుల్లో 143 పరుగులతో నాటౌట్‌గా కొనసాగుతున్నాడు. ఇప్పుడు భారత్ స్కోర్ 0 వికెట్ల నష్టానికి253గా ఉంది.. మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. ప్రస్తుతం భారత్ విజయ లక్ష్యానికి 152 పరుగుల దూరంలో ఉంది.. అంటే భారత్ 144 బంతుల్లో 152 పరుగులు చేయాల్సి ఉంది. భారత్ బ్యాటర్ దూకుడు ఇలాగే కొనసాగితే విజయం ఈజీగా భారత్‌కు దక్కుతంది.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com